Sri Anjaneya
SECURITY & HOUSEKEEPING SERVICES

ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ,యువకులు కావలెను.

మార్కెటింగ్ మేనేజర్ (M/F),సెక్యూరిటీ గార్డ్స్ (M/F), కారు డ్రైవర్లు, అకౌంటెంట్,ఆఫీస్ ఇన్ చార్జ్(F), అర్జంట్ గా కావలెను.

contact: 9392480345,9100397039

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక
NEWS
విలేకరులు కావలెను
గ్లోబల్ వార్త తెలుగు దినపత్రికలో పనిచేయడానికి విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాష పై పట్టు వున్న వారు సంప్రదించగలరు.
PRESS
కావాల్సిన జిల్లాలు :
ఒంగోలు
బాపట్ల
నరసరావుపేట
గుంటూరు
విజయవాడ
రాజమండ్రి
నర్సాపురం
ఏలూరు
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9392480345 9391522600

సంపుటి : 01 సంచిక : 61 22 - 10 - 2026 గురువారం ఎడిటర్ : దొండ్లవాగు భవ్య పేజీలు : 8 వెల : 10/-

రౌడీయిజం చేస్తే సహించం

శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి : సీఎం చంద్రబాబు

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం



జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు.

శాంతిభద్రతలతోనే అభివృద్ధి, పెట్టుబడులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. "భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను"

8 లో

ఏపీ మున్సిపల్ ఎన్నికలు



8లో

ఎస్ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది. తమ అభ్యర్థులను 19 చోట్ల నామినేషన్లు

అమెరికా - పాక్ దోస్తీ




8లో

భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

న్యూఢిల్లీ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర సహకారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో

నామినేషన్ల దాఖలుకు నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదు

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత



న్యూఢిల్లీ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలకమైన స్పష్టత ఇచ్చింది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్ఓసీ) లేదా 'నో డ్యూస్ సర్టిఫికెట్' సమర్పించాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టం చేసింది. ఈ మేరకు అమరావతి నుంచి ఎస్ఈసీ ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల చట్టాల ప్రకారం ఈ పత్రాలు తప్పనిసరి కాదని పేర్కొంది. కేవలం ఈ సర్టిఫికెట్లు లేవన్న కారణంతో నామినేషన్ల స్వీకరణను నిలిపివేయవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, నామినేషన్‌కు అవసరమైన ఇతర పత్రాలను మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదాల నేపథ్యంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, నామినేషన్ల అడ్డంకులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే ప్రభావిత ప్రాంతాల్లో కనీసం 48 గంటల పాటు గడువు పొడిగింపుపై గురువారం నాటికి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అలాగే, అక్టోబర్ 25 వరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని ఆదేశించింది. ఈ పరిణామాల మధ్య, ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఎస్ఈసీ ఈ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది.



8వ పేజీలో

మార్కెట్లోకి జియో ఐపీఓ

ఇది ఒక కొత్త అధ్యాయం : ఆకాశ్ అంబానీ

న్యూఢిల్లీ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : భారత టెలికాం, డిజిటల్ రంగంలో సంచలనాలు సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్, తన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)తో స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ బుధవారం (అక్టోబర్ 21) ప్రారంభమైంది. దీని ద్వారా సుమారు రూ. 30,213 కోట్లను

డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు

న్యూఢిల్లీ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యానికి కొత్త రాడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.770 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంప్రూవ్డ్ లో-లెవల్ లైట్‌వెయిట్ రాడార్ వ్యవస్థలను సమకూర్చుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ రాడార్లు సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచ



మిగతా 8లో...

నున్నాయి. ఈ రాడార్లతో యుద్ధ విమానాల పరిమాణంలో ఉండే లక్ష్యాలతో పాటు చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను పర్యవేక్షించవచ్చు. గగనతలంలో గుర్తించిన లక్ష్యాల్లో ఏవి ఎక్కువ ప్రాధాన్యంతో ఎదుర్కోవాలో నిర్ణయించేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. దీంతో మానవరహిత వైమానిక వ్యవస్థల (యూఏఎస్) నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో సైన్యానికి సహాయం అందనుంది. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్

2వ పేజీలో



8లో

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార



8లో

జగన్‌కు షాక్

సొంత జిల్లాలో టీడీపీ ఖాతాలోకి ఏకగ్రీవంగా 6 మున్సిపాలిటీలు

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కడప జిల్లాలోని కీలక మున్సిపాలిటీలను టీడీపీ నేతృత్వంలోని కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుని రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ విజయాలతో జిల్లాపై టీడీపీ పట్టు సాధించినట్లయింది. తాజా పరిణామాల ప్రకారం... ప్రొద్దుటూరు, బద్వేల్,

స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే

ట్రిపుల్ ఇంజన్ అభివృద్ధి : మంత్రి గొట్టిపాటి

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరుశాతం కూటమి అభ్యర్థులే గెలవాలని ఇంధనశాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటిస్తూ.. ప్రజలతో ముచ్చటించారు. ఆయనతో పాటు మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ భాష్యం రామకృష్ణ ఉన్నారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ భాష్యం రామకృష్ణతో కలిసి ఆయన జిల్లాలోని పాలకొల్లు, నరసాపురం, ఆచంటతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

ఈ మేరకు ఆయన ప్రజలకను ద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులనే గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు. కూటమి గెలుపు కోసం కార్యకర్తలు పార్టీలకతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



గొడ్డలి పార్టీ అధికారంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. దానితోపాటు కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అమరావతి రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడుగడునా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తే నష్టపోతారని మంత్రి ప్రజలను హెచ్చరించారు.

ఈ క్రమంలో వెలిగొండ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తవడంలో మంత్రి నిమ్మల రామానాయుడి పాత్రను గొట్టిపాటి కొనియాడారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి.. 40 రోజుల్లోనే సుమారు రూ. 950 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందేలా నిమ్మల చర్యలు తీసుకున్నా రని వెల్లడించారు. అనంతరం కూటమి తరఫున పోటీచేసే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు కండువాలు కప్పి అభినందించారు.

ప్రకాశం జిల్లాలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు



ఒంగోలు, వార్తాధ్వని : అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ శ్రీ రాజబాబు.,ఐఏఎస్ , ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ మరియు పోలీసు అధికారులు పాల్గొని అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఐఏఎస్ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే గొప్ప సేవ అని కొనియాడారు. విధి నిర్వహణలో 154 మంది పోలీసులు ప్రాణత్యాగం చేయడం వారి అంకితభావానికి, త్యాగనిరతికి నిదర్శనమన్నారు. పోలీసులంటే ప్రజల్లో ఎంతో నమ్మకం ఉంటుందని, ఏ చిన్న సంఘటన జరిగినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని తెలిపారు. మహిళల విషయంలో చిన్నపిల్లల విషయంలో ఏదైనా సంఘటన జరిగితే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనన్నారు. పోలీసు విధి నిర్వహణలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని సూచించారు. విధి నిర్వహణలో విమర్శలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా అధిగమిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గత సంవత్సర కాలంగా జిల్లాలో నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని, రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. మహిళల రక్షణ విషయంలోనూ గణనీయమైన పురోగతి ఉన్నదని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు.,ఐపీఎస్ గారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమర పోలీసు సోదరులకు అశ్రునివాళులర్పిస్తూ యావత్ భారతదేశం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. 1959 వ సంవత్సరము అక్టోబరు 21వ తేదిన జమ్మూ కాశ్మీర్ లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో సముద్రమట్టానికి 5000 మీటర్ల ఎత్తున గల దేశ సరిహద్దు అయిన లడక్ లోని హాట్ స్ప్రింగ్ ప్రాంతములో భారత దేశం పై చైనా దురాక్రమణకు పాల్పడినదని, రక్తాన్ని గడ్డకట్టించే చలిలో దేశరక్షణ కోసం కాపల డ్యూటీ లో వుండి అకస్మాత్తుగా దొంగదెబ్బ తీసిన చైనా ముష్కర సైనికులతో వీరోచిత పోరాటము చేసి 10 మంది జవాన్లు అశువులు బాసారని, వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరము అక్టోబరు 21 న "పోలీసు అమర వీరుల సంస్మరణ దినం" జరుపుకుంటున్నామని, ఇటీవలే భారత ప్రభుత్వము అక్టోబరు 21వ తేదీని "నేషనల్ పోలీస్ డే" గా ప్రకటించిందని తెలిపారు. మన దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న సైనికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శత్రువులతో వీరోచితంగా పోరాడుతున్నారని తెలిపారు. అదే విధంగా, సమాజ రక్షణ కోసం శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమైన పోలీసు సోదరులు ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్ఛిన్నకర శక్తులతో పాటు నేరాలకు పాల్పడే అసాంఘిక శక్తులపై పోరాడుతూ సమసమాజ నిర్మాణానికి కంకణబద్ధులై అమరులౌతున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగనిరతి నిత్యం స్ఫూర్తిదాయకమని, పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ వారి త్యాగాలు ఉత్తేజాన్ని అందించాలని ఆకాంక్షించారు. వారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, మన హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని వారి అమూల్యమైన త్యాగాలకు సెల్యూట్ చేస్తూ ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. సరిహద్దులను కాపాడే సైన్యంతో పోల్చుకుంటే, సమాజంలో అంతర్గత శాంతిభద్రతలను కాపాడే పోలీసుల విధినిర్వహణ క్లిష్టంగా మరియు ప్రాణాంతకంగా తయారై, పోలీసు ఉద్యోగం కత్తిమీద సాములాగా తయారయిందనే విషయం మీకందరికీ తెలిసిందే. సమాజంలో ఏ చిన్న సంఘటన జరిగినా పోలీసు శాఖపై ఎంతో ఒత్తిడి ఉంటుంది. శాఖాపరమైన ప్రతిష్ట అక్కడ ముడిపడి వుంటుంది. అందుకే విధినిర్వహణలో భాగంగా మనము అనేక ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. అయిననూ అన్నింటికి ఓర్చుకొని, సాంప్రదాయక పోలీసు విధానలతో పాటుగా, ఆధునిక పోలీసింగ్ టెక్నిక్ లు అలవరచుకొని, సమాజంలో ప్రతిఒక్కరు మనల్ని మెచ్చుకునేలా వ్యవహరిస్తూ ఆడుగు ముందుకు వేయవలసి వుంటుంది. మనదేశంలో ఈ సంవత్సరము శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై విధినిర్వహణలో 154 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారు. మృతవీరులందరికి జోహార్లు తెలియజేస్తూ నివాళులు అర్పిద్దాం. నేటి మననిశ్చింత జీవనం వారి అవిశ్రాంత త్యాగఫలం అందుకే ఆ అమరులను స్మరించుకుందాం. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు 1.కీర్తిశేషులు శ్రీ అద్దంకి సాల్మన్ కేరీ వెస్లీ ఐ.పీ.ఎస్., గారు 2.కీర్తిశేషులు శ్రీ లేళ్ళ శంకర్ జూనియర్ కమాండర్, గ్రేహౌండ్స్ 3.కీర్తిశేషులు శ్రీ మోటా ఆంజనేయులు జూనియర్ కమాండర్, గ్రేహౌండ్స్ 4.కీర్తిశేషులు కె.వి ప్రశాంతరావు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ 5.కీర్తిశేషులు శ్రీ చప్పిడి వెంకట రత్నం ఆర్మడ్ రిజర్వు కానిస్టేబుల్ 6.కీర్తిశేషులు శ్రీ ఎస్ కె మహమ్మద్ రఫీ కానిస్టేబుల్ 7.కీర్తిశేషులు శ్రీ ఈ.పవన్ కుమార్ కానిస్టేబుల్ లను త్యాగాలను జిల్లా ఎస్పీ గారు కొనియాడారు. అలాగే గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి ఈ సంవత్సరం ప్రకాశం జిల్లా పోలీస్ శాఖకు చెందిన 12 మంది పోలీసులు విధి నిర్వహణ లో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అమరులైన సిబ్బంది యొక్క కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ గారు బహుమతులు అందజేశారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తముగా ప్రాణాలను కోల్పోయిన 154 మంది పోలీస్ బలగాల సిబ్బంది యొక్క పేర్లులను అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ. యన్.యుగంధర్ బాబు గారు ఈ కార్యక్రమములో చదివి విన్పించి శ్రద్ధాంజలి ఘటించినారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు పోలీస్ అమరవీరుల ర్యాలీని జిల్లా కలెక్టర్ గారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పోలీసులు అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేసినారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణా శాఖ కమిషనర్ శ్రీమతి అర్.సుశీల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ. యన్.యుగంధర్ బాబు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్)వెంకటేశ్వర్లు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీధర్, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, =xలు ఎస్సైలు,అమర వీరుల కుటుంబ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు నామినేషన్ కేంద్రం వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్



పొదలకూరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : నామినేషన్ కేంద్రం వద్ద పోలీసుల వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది.స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో వార్తా సేకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులను కేంద్రం వద్దకు అనుమతించకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతు న్నాయి. జిల్లాలో పలుచోట్ల మీడియాకు పాయింట్ ఏర్పాటు చేసి, అక్కడ నుండి కవరేజ్ చేసుకునే విధంగా వెసులుబాటు కల్పించారు. కానీ పొదలకూరులో ఆ పరిస్థితి లేదు. ఫలితంగా మీడియా ప్రతినిధులు రోడ్ల మీద ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల వట్ల పోలీసులు ఆంక్షలు విధించడంతో పాటు, ఏదైనా సమస్య ఉంటే రిటర్నింగ్ అధికారితో మాట్లాడుకోవాలంటూ దురుసుగా సమాధానమిచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.అదే సమయంలో ప్రజలకు సమాచారాన్ని చేరవేసే మీడియా విధులకు ఆటంకాలు కలగకుండా చూడాల్సిన అవసరం కూడా ఉంది.భద్రతా కారణాలతో ఆంక్షలు విధించినప్పటికీ,వాటి పరిధి ఏమిటి? మీడియా ప్రతినిధులను ఎందుకు అనుమతించడం లేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మీడియా విధులకు ఆటంకాలు కలగకుండా,ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని పాత్రికేయులు కోరుతున్నారు.పొదలకూరు నామినేషన్ కేంద్రం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? మీడియా ప్రతినిధులకు స్పష్టత ఇస్తారా? అనేది వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.

పదవులు బాధ్యతలను పెంచుతాయి



నెల్లూరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : పదవి అనేది బాధ్యతలను పెంచుతాయని నెల్లూరు జిల్లా పి.ఎం.పి అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. కమ్యూనిటీ ఫారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో బుధవారం, బుజబుజ నెల్లూరులోని పిఎంపి కార్యాలయం నందు పిఎంపి నూతన కార్యవర్గంలో 11వ సారి అధ్యక్షుడిగా ఎన్నికైన తనకు, మూడోసారి గౌరవాధ్యక్షులుగా ఎంపికైన డా. అనుముల జయప్రకాష్ కు మిత్రులు చేసిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదవులు అనేవి అలంకారప్రాయం, నామమాత్రం కాదని ఎంతో బాధ్యతతో కూడినపని అని ఆయన పేర్కొన్నారు. పదవిలో ఉన్నప్పుడు సంక్షేమంతో పాటు వారి సమస్యలను పరిష్కరించవలసి ఉంటుందని అప్పుడే సభ్యులలో ఆత్మీయత, స్నేహభావ్యం, ధైర్యం నెలకొల్తోందని ఆయన పేర్కొన్నారు. సత్కారసభ సంతోషంతో పాటు బాధ్యతను గుర్తు చేస్తున్నాయని అన్నారు. తన విధులను గుర్తించి సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కుదుముల సుబ్బారావు, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్ బాషా, పీఎంపీ సభ్యులు దేవరకొండ శ్రీనివాసులు, కూనిశెట్టి పెంచలలక్ష్మి, సింహాద్రి నాగరాజు, మధుసూదన్ రావు, మహేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యం



రేణిగుంట , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల స్థాయి ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా.దాలర్స్ దివాకర్ రెడ్డి ఈరోజు విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కమిటీల సన్నద్ధత ఓటర్ల జాబితా పరిశీలన మరియు ఎన్నికల వ్యూహాలపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మనందరికీ అత్యంత కీలకమని, మండలంలోని ప్రతి ఎంపీటీసీ స్థానంతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేయడమే మన లక్ష్యమన్నారు. ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు అంతర్గత విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో ఐక్యమత్యంతో పని చేయాలి అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట కూటమి మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్ర తినిధులు, వివిధ ఎంపీటీసీ అభ్యర్థులు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

మడకశిర నగర పంచాయతీ ఎన్నికలు. కూటమి అభ్యర్థులకు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ చేతుల మీదుగా బీఫారాల అందజేత

మడకశిర , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : మడకశిర నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీ తరపున బరిలో నిలిచిన 23 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు అధికారికంగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా పార్టీ బీఫారాలను అందజేశారు. మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యులు, మడకశిర ఎమ్మెల్యే శ్రీ ఎం.ఎస్. రాజు మరియు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ గుండుమల తిప్పేస్వామి సంయుక్తంగా అభ్యర్థులకు బీఫారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం అందరూ ఐక్యంగా సమన్వయంతో పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీ శ్రీనివాస మూర్తి, కార్పొరేషన్ చైర్మన్లు, అలాగే కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు చిలకం మధుసూదన రెడ్డి, జనసేన పార్టీ హిందూపూర్ పార్లమెంట్ సమన్వయకర్త నవీన్ నిర్చల్, ఆకుల ఉమేష్ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రన్న "సంకల్పం" పేదలకు పట్టాభిషేకం



అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : తక్షణ రాజకీయ లాభాలు లేదా ఓట్ల కోసం కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పేద ప్రజలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టాలన్నది చంద్రబాబు నాయుడు సంకల్పం. ఆ సంకల్పాన్ని నిజం చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. చంద్రబాబు నాయుడు సంకల్ప బలం రాష్ట్ర భవిష్యత్తును మార్చేసిందనడం లో సందేహమే లేదు. రాజకీయ నాయకుడి సంకల్పం స్వార్థంతో కూడుకున్నదైతే వ్యవస్థ నాశనమవుతుందనడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ చక్కని ఉదాహరణగా చెప్పాలి.. అదే సమాజ శ్రేయస్సు కోసం అయితే ఆ రాష్ట్రం చరిత్రలో నిలిచిపోతుందనడానికి చంద్రబాబు నాయుడు అందుకు తార్కాణం.ఉపాధికి ఊపిరి ఆయన.. యువ రక్తానికి ఆదర్శం ఆయన..పేదోడి గుండెల్లో నిలిచిన ఆత్మీయ బంధువు చంద్రబాబు నాయుడు. నిన్న విశాఖపట్నం.. నేడు విజయవాడలోని పేద ప్రజలు ఎన్నాళ్లో వేచిన ఉదయాన వారి చిరకాల స్వప్నాన్ని చంద్రన్న సాకారం చేస్తుండడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. 2024ఎన్నికల్లో ఓటు వేసిన వేలాది కుటుం బాలకు కూటమి ప్రభుత్వం ఆస్తి హక్కును కల్పించడం చారిత్రక ఘట్టంగా అభివర్ణించవచ్చు. పదిహేనేళ్ల ఎదురుచూపులు ఫలించాయి. ఒక్క ఇంటి పట్టాతో పేదల జీవితాలు మారిపోయాయి. ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే. దేశంలో ఏ నాయకుడూ చేయలేనిది సీఎం చంద్రబాబు గారు చేసి చూపించి మహిళలకు పెద్దన్న గా నిలిచారు చంద్రన్న. దశాబ్దాలుగా సొంతింటి హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల జీవితాల్లో సరికొత్త వెలుగులను కూటమి ప్రభుత్వం నింపుతున్నది. పేదల కళ్లను ఆనందబాష్పాలతో నింపుతూ, వారి కలలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని నిర్వహించి 28,445 పేదలకు పట్టాలతో పాటు ఆస్తి యాజమాన్య బదిలీ పత్రాలను చంద్రబాబు అందించారు. అదే స్ఫూర్తితో ఈ నెల 30న విజయవాడ నగరంలోని 24,057 పేదలకు పట్టాభిషేకం చేయడం అపూర్వ ఘట్టం. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడి సరికొత్త చరిత్రను సృష్టించింది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది.

పట్టాభిషేకంలో లబ్ధిపొందే వారిలో బడుగు బలహీనవర్గాలవారే కావడం విశేషం

ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి. గత ప్రభుత్వాల కాలంలో కేవలం హామీలకే పరిమితమైన విజయవాడ ఇళ్ల స్థలాల సమస్యకు చంద్రబాబు నాయుడు పక్కా వ్యూహంతో ముగింపు పలికారు. ఈ నెల 30న జరగబోయే భారీ బహిరంగ సభలో ఏకంగా 24,057 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను సీఎం చంద్రబాబు స్వహస్తాలతో అందజేయనున్నారు. దశాబ్దాలుగా ఎంతోమంది ముఖ్యమంత్రులు మారినా, ఎన్నో ఎన్నికలు వచ్చినా పరిష్కారం కాని ఈ సుదీర్ఘ నిరీక్షణకు కూటమి ప్రభుత్వం కేవలం కొద్ది నెలల పాలనలోనే చరమగీతం పాడటం విశేషం. తాము నివసిస్తున్న స్థలాలపై తమకు హక్కులు లేక, ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోనని భయపడుతూ బతికిన విజయవాడ పేదలకు ఇది నిజంగా పండుగ. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన రాజకీయాన్ని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇస్తున్న పట్టాలను పరిశీలిస్తే స్పష్టమైన తేడా కనిపిస్తున్నది.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సెంటు భూమి పేరుతో ఊళ్లకు మైళ్ల దూరంలో, కొండల్లో, గుట్టల్లో, లోతట్టు ప్రాంతాల్లో కేవలం 'కాగితాలు' ఇచ్చి చేతులు దులుపుకుంది. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం పేదలు దశాబ్దాలుగా ఎక్కడైతే నివాసం ఉంటున్నారో, ఆ విలువైన నగర ప్రాంతాల్లోనే వారికి సంపూర్ణ యాజమాన్య హక్కులతో కూడిన శాశ్వత పట్టాలను ఇస్తూ పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. 40 ఏళ్ల క్రితమే పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే గొప్ప ఆలోచనతో స్వర్గీయ ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. అదే స్ఫూర్తితో మా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది ఇన్నాళ్లూ తాము ఉంటున్న స్థలాలపై ఎలాంటి వివాదాలు, భయాలు లేకుండా శాశ్వత హక్కులు దక్కడంతో లబ్ధిదారుల్లో అపరిమితమైన ఉత్సాహం, ఆనందం వ్యక్తమవుతున్నాయి. ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్ని ర్మాణానికి చంద్రబాబు ఒక్కో ఇటుకా పేరుస్తున్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తు న్నారు ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం.

అధికారుల అండతో అక్రమాలు చేస్తున్న టీడీపీ నేతలు!

ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): ఒంగోలులో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికారుల అండతో తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఒంగోలు మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్ ఆరోపించారు. బుధవారం రామనగర్‌లోని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కేంద్రం వద్ద చోటుచేసుకున్న పరిణామాలతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అభ్యర్థి అచూకీపై ఆందోళన

వైఎస్సార్‌సీపీ తరఫున కార్పొరేటర్ అభ్యర్థిగా రాజేష్‌ను ఎంపిక చేయడంతోపాటు, ప్రత్యామ్నాయ అభ్యర్థిగా శ్రీకాంత్‌తో కూడా నామినేషన్ దాఖలు చేయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బుధవారం ఉదయం రాజేష్‌కు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బీఫారం అందజేసినట్లు పేర్కొన్నాయి. అయితే, ఆ తర్వాత ఆయన ఫోన్ అందుబాటులో లేకపోవడం, పార్టీ కార్యాలయానికి సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన ఆచూకీపై ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాజేష్‌ను ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే అనుమానాలను వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యక్తం



చేశారు. దీంతో ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన శ్రీకాంత్‌ను అభ్యర్థిగా ఖరారు చేస్తూ పార్టీ నాయకులు నిర్ణయం తీసుకుని ఆయనకు బీఫారం అందజేశారు. అనంతరం శ్రీకాంత్ బీఫారంతో ఆర్వో కేంద్రానికి వెళ్లగా, అవసరమైన పత్రాల హార్డ్ కాపీ తీసుకురావాలని, డాక్యుమెంటేషన్ సక్రమంగా లేదని అధికారులు సూచించినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి.

ఆర్వో కేంద్రం వద్ద వాగ్వాదం

అవసరమైన హార్డ్ కాపీతో శ్రీకాంత్ తిరిగి ఆర్వో కేంద్రానికి వెళ్లినప్పటికీ, సంబంధిత పత్రాలను అధికారులు స్వీకరించలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న టీడీపీ అభ్యర్థి అప్పాజీ, శ్రీకాంత్ కాలర్ పట్టుకుని బయటకు లాక్కొచ్చారని వారు పేర్కొన్నారు. పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీ మహిళా అభ్యర్థి జోక్యం చేసుకుని శ్రీకాంత్‌ను కాపాడినట్లు తెలిపారు.

అధికారులను నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్ తదితర నాయకులు ఆర్వో కేంద్రానికి చేరుకుని అధికారులను ప్రశ్నించారు. ఘటనకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఈ పరిణామాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగాలని, అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి వివక్షకు తావుండకూడదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒంగోలు నగరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తా

వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్



ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఒంగోలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు. నగర ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే ఒంగోలును అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ అభ్యర్థులకు బీఫారాలు అందజేసే కార్యక్రమం సందర్భంగా ఆయన తన అభివృద్ధి ప్రణాళికలను వెల్లడించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఒంగోలు నగరం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని పేర్కొంటూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

వేగంగా విస్తరిస్తున్న ఒంగోలు నగరంలో కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల ప్రజలు కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. నగరంలో విలీనమైన ప్రాంతాల్లోని చెరువులను మంచినీటి వనరులుగా అభివృద్ధి చేయడంతోపాటు, వాటి పరిసరాల్లో ఆహ్లాదకరమైన పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు.

ప్రజలకు ఆహ్లాదకరమైన నగరంగా ఒంగోలు

నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. గతంలో తాను పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నానని, ఒంగోలులో గోశాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందించానని, దేవుడు చెరువు పార్కు అభివృద్ధికి కూడా కృషి చేశానని గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ ప్రజోపయోగ కార్యక్రమాలకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పారిశుధ్యం, దోమల నివారణపై దృష్టి నగరంలో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ వంటి ప్రజారోగ్య అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కుప్పం ప్రసాద్ అన్నారు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వ చర్యలు సరిపోవడం లేదని విమర్శించారు. ప్రజలకు మెరుగైన పట్టణ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒంగోలు నగర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్న కుప్పం ప్రసాద్, నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మడకశిర నగర పంచాయతీ ఎన్నికలు..కూటమి అభ్యర్థులకు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ చేతుల మీదుగా బీఫారాల అందజేత



మడకశిర , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): మడకశిర నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీ తరఫున బరిలో నిలిచిన 23 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు అధికారికంగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా పార్టీ బీఫారాలను అందజేశారు. మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యులు, మడకశిర ఎమ్మెల్యే శ్రీ ఎం.ఎస్. రాజు మరియు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సంయుక్తంగా అభ్యర్థులకు బీఫారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం అందరూ ఐక్యంగా సమన్వయంతో పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీ శ్రీనివాస మూర్తి, కార్పొరేషన్ చైర్మన్లు, అలాగే కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు చిలకం మధుసూదన రెడ్డి, జనసేన పార్టీ హిందూపూర్ పార్లమెంట్ సమన్వయకర్త నవీన్ నిశ్చల్, ఆకుల ఉమేష్ (జనసేన హిందూపూర్ ఇన్‌చార్జ్) పురుషోత్తం (బీజేపీ నేత) మరియు పలువురు కూటమి కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తరపున 5 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు

గుడిబండ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నుంచి ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు చేపట్టారు. మొదటి రోజు కాంగ్రెస్ పార్టీ తరఫున 5 ఎంపీటీసీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలోని మందలపల్లి నుంచి సనావుల్లా ,గుణేమోరు భాగల్, ముబారక్ భాషా ముత్తుకూరు, గిరిజమ్మ గుడిబండ, ఎంపీటీసీ 1 నుంచి లక్ష్మీదేవి కొంకల్లు, నుంచి మహాలింగప్ప కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి జయ కుమార్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గుడిబండ ఎస్సై రమేష్ బాబు తన సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రవీంద్ర విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా ఆయుధ పూజ

గుడిబండ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): స్థానిక రవీంద్ర విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆ పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమాన్ని జరుపుకున్నారు దసరా పండుగను పురస్కరించుకుని పాఠశాలలో ఉన్న వాహనాలు విద్యా పరికరాలు ఇతర పనిముట్లు ఉంచి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించడంతో పాఠశాల అంతా పండుగ వాతావరణం నెలకొంది. విద్యాభివృద్ధికి అంకితభావంతో తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులకు అదేవిధంగా డ్రైవర్లకు ఆయాలకు పాఠశాల యాజమాన్యం దసరా పండుగ కానుకగా దుస్తులు పంపిణీ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పాఠశాల కుటుంబ సభ్యులు ఒకరికొకరు దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని భవిష్యత్తులో రవీంద్ర విద్యానికేతన్ పాఠశాల మరెన్నో విజయాలు సాధించి విద్యాభివృద్ధికి అంచలంచలుగా బాటలు వేయాలని విద్యానికేతన్ యాజమాన్యం కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ రాజు ఉపాధ్యాయ బృందం పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూజెల్లపల్లిలో ఘనంగా పారువేట, గ్రామోత్సవం



పంగులూరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): మండలంలోని నూజెల్లపల్లిలో దశాబ్దన్నరకాలంగా నిలిచిన దసరా ఉత్సవాలు హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరి దేవస్థానానికి సంబంధించి విజయదశమి సందర్భంగా పారువేట, శమిపూజ, గ్రామోత్సవం కార్యక్రమాలు అర్చకులు, స్వస్థి వాచకులు సంయుక్తంగా నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు పోలీస్ పటిష్ట బందోబస్తు మధ్య దేవస్థానం అధికారులు, తహసీల్దార్ పర్యవేక్షణలో వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశపారంపర్య అర్చకులు ఉత్సవమూర్తులను ఆలయం నుంచి తోడ్కొని వచ్చేందుకు సహకరించకపోవడంతో జిల్లా దేవదాయ శాఖ అధికారి అమర్నాథ్ పర్యవేక్షణలో ఈవో శ్రీనివాసరావు ప్రత్యామ్నాయ అర్చకస్వాముల తో క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. స్వస్థివాచకులు నిర్వహించిన పారువేట, శమిపూజ కార్యక్రమాలలో మహిళలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ వర్యవేక్షణలో సీఐలు మల్లికార్జునరావు, సుబ్బరాజు, ఎస్ఐలు సురేష్, నాగరాజు పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించగా, తహసీల్దార్ సింగారావు పాల్గొన్నారు

రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం : మేయర్ అభ్యర్థి నల్లమల్లి శిల్ప



ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): నగరంలోని రంగారాయుడు చెరువు కట్టపై ఉన్న వాకింగ్ ట్రాక్ వద్ద స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గారి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్డీఏ కూటమి బలపరిచిన ఒంగోలు టీడీపీ మేయర్ అభ్యర్థి శ్రీమతి నల్లమల్లి శ్రీ శిల్ప తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒంగోలులోని రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ వద్దకు చేరుకున్న శ్రీమతి నల్లమల్లి శిల్ప , వాకర్స్ మిత్రులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ చేస్తున్న వారిని పేరుపేరునా పలకరిస్తూ, స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒంగోలు నగర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గారు చేస్తున్న కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మేయర్‌గా తనను గెలిపిస్తే, ఎమ్మెల్యే శ్రీ దామచర్ల జనార్ధన్ సహకారంతో ఒంగోలు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తనను ఇంటి బిడ్డగా ఆదరించి, తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి, మేయర్ అభ్యర్థిగా గెలిపించాలని వాకర్స్ మిత్రులను, నగర ప్రజలను నల్లమల్లి శ్రీ శిల్ప విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, పలుపురు ప్రముఖులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించిన కలెక్టర్ పి రాజాబాబు



ముండ్లమూరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): జిల్లాలో 27 జడ్పిటిసి 373 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలైందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. బుధవారం తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి తదితర ప్రాంతాల్లో పర్యటించి నామినేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిబంధనల మేరకు నామినేషన్లు వేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల నియమావళి అనుసరించి అభ్యర్థితోపాటు తక్కువ మందిని అనుమతించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎలక్షన్స్ సంబంధించి జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని దర్శి ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించడం జరిగిందన్నారు. వెబ్ కాస్టింగ్ తో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వారితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా తమ వంతు సహాయ సహకారాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన రాజకీయ పార్టీలను కోరారు. ఎన్నికల నిబంధనల మేరకు 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండడం నిషేధం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి చేరిన గుండుమల శారదమ్మ



మడకశిర , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో జిల్లా కోఆర్డినేటర్ నవీన్ నిశ్చల్, జిల్లా అధ్యక్షులు చిలకం మధుసూదన్ రెడ్డి,హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త ఆకుల ఉమేష్ జనసేన పార్టీ నాయకులు శివాజీ యశ్వంత్ పవన్ ఆనంద్ సమక్షంలో గుండుమల శారదమ్మ రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. వీరి వెంట వందలాదిమంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .ఈ సందర్భంగా జనసేన నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి ముఖముడిగా గుండుమల శారదమ్మను మడకశిర నగర పంచాయతీ జనసేన పార్టీ చైర్పర్సన్ అభ్యర్థిగా శారదమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైకాపాను వీడి టీడీపీలోకి భారీగా వలసలు

వలమనేరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): మున్సిపల్ మరియు ఎంపీటీసీ జడ్పిటిసిల ఎన్నికల నేపథ్యంలో పలువురు వైకాపా నాయకులు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పలమనేరు పట్టణం మరియు గంగవరం మండలాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణంలోని చరకా కాలనీ, విద్యానగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, గడ్డూరుకి చెందిన ఆర్. ఎస్. రఫీ, రాజ్ కుమార్, వినాయక, దేవిడ్, పాల్, చంద్రశేఖర్, దాము, అమీర్, షంషీర్, రఫీ, క్రిష్ణ మూర్తి, రవికుమార్, రషీద్, శ్రీనివాసులు తదితరులు వైకాపా ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వారికీ పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వానం పలికారు. అదేవిదంగా గంగవరం మండలంలోని కలగటూరుకు చెందిన మాజీ వార్డు మెంబర్ పీ. కేశవ రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి వెంకట్రాం గౌడ్, శ్రీకాంత్, మంజు, ఆటో వెంకటరమణ, శంకర, విశ్వనాథ్ తదితరులు వైకాపా ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వారికీ పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి కృష్ణ మూర్తి గౌడ్, గంగవరం మండల నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రసాద్ నాయుడు, తదితరులున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు..
అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించకుండా సహకరించాలి



ఏలేశ్వరం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, ఐపీఎస్ కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ తో కలిసి బుధవారం ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల రక్షణకు తీసుకున్న చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని తెలిపారు. ఈరోజు నామినేషన్లు తక్కువ సంఖ్యలో దాఖలయ్యాయని, రాబోయే రెండు రోజులు మంచి రోజులు కావడంతో నామినేషన్లు ఎక్కువగా దాఖలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా ర్యాలీలు నిర్వహించడం వల్ల అవాంఛనీయ ఘటనలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ర్యాలీలు నిర్వహించకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగేందుకు సహకరించాలని ఐజీ విజ్ఞప్తి చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐజీ , ఎస్పీ పెద్దాపురం చేరుకుని అక్కడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని, బందోబస్తు పటిష్టంగా అమలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాజబాబు గీతాలాపన తో తన్మయం చెందిన భక్తులు



విజయవాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విజయవాడ, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నందు శ్రీ కనక దుర్గా అమ్మవారి సన్నిధిలో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలలో దేవస్థాన ఈ.ఓ ఆహ్వానం మేరకు హాజరైన టి.వి ఆకాశవాణి గాయకులు, వ్యాఖ్యాత అయిన కరక రాజుబాబు,కాకినాడ వారు ప్రదర్శించిన "భక్తి సంగీత గీతాలాపన"కార్యక్రమం ఆద్యంతం భక్తులను ఆధ్యాత్మిక చింతనతో తన్మయత్వం చెందేలా అద్భుతంగా సాగింది. వ్యాఖ్యానంతో పాటు రాగ, తాళ,భావయుక్తంగా ఆలపించిన భక్తి గీతాలు భక్త జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం దేవస్థాన అధికారులు గాయకులు రాజుబాబును అభినందిస్తూ ప్రశంసా పత్రాన్నిజ్ఞాపికను, ప్రసాదంతో పాటు కండువాను వేసి నగదు పారితోషకంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజుబాబు తనకు అవకాశమిచ్చిన దేవస్థాన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరులకు ఘన నివాళి
అమరవీరుల త్యాగాలు పోలీసులకు స్ఫూర్తిదాయకం : కలెక్టర్, ఎస్పీ



రాజమహేంద్రవరం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్ పుష్పాంజలి ఘటించి, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు కీలకమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో పోలీసు అధికారులు, సిబ్బంది కర్తవ్యనిష్ఠతో పనిచేస్తూ, నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లో భారత్--చైనా సరిహద్దు వద్ద జరిగిన దాడిలో పది మంది భారత పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు గుర్తుగా ఏటా ఈ రోజున సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 11 రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించి, అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను అధికారులు పరామర్శించి, వారి కుటుంబాల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ, అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఏఎస్పీ తరుణ్ పహ్వా, డీఎస్పీలు వై. శ్రీకాంత్, ఏ. శివప్రియ, సిహెచ్. జీవన, బి. రామకృష్ణ, ఇతర పోలీసు అధికారులు, పోలీసులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మార్కాపురం జడ్పీపై వైసీపీ దృష్టి

ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): స్థానిక ఎన్నికలకు సంబంధించి ప్రకాశం జిల్లా విషయాన్ని పక్కనపెట్టి మార్కాపురం జిల్లాపై వైసీపీ ఎక్కువ దృష్టి సారిస్తోంది. అయితే తెలుగుదేశం పార్టీ ముందు నుంచి వ్యూహాత్మకంగా ఉండటంతో వైసీపీకి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రకాశం జడ్పీ విషయంలో కనీస ప్రాథమిక చర్చలు కూడా నిర్వహించని వైసీపీ అధిష్ఠానం.. మార్కాపురం జడ్పీ చైర్మన్ విషయంలో అక్కడి నాయకులతో విస్తృత చర్చలు జరుపుతోంది. మార్కాపురం ప్రాంతం తమకు కంచుకోటగా వైసీపీ భావిస్తుంటుంది. అయితే గత ప్రభుత్వంలో ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఏమాత్రం ప్రాధాన్య మివ్వలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాంతానికి ప్రత్యేక జిల్లాను ఇవ్వడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించింది. హార్టికల్చర్ హబ్‌లో ఆ ప్రాంతాన్ని చేర్చింది. దీంతో ప్రజల్లో సానుకూలత పెరిగింది. తమ కంచుకోటకు బీటలు పడుతున్నాయన్న భావనతో కాబోలు వైసీపీ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆ ప్రాంత నాయకులను ఐక్యంగా ముందుకు నడిపేందుకు సిద్ధమైంది. తదనుగుణంగా రెండు దశాబ్దాల క్రితం ఎమ్మెల్యేగా పనిచేసిన ఉడుముల శ్రీనివాసరెడ్డిని జడ్పీ చైర్మన్ పదవికి పోటీ చేయాలంటూ వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి చేసినట్లు తెలిసింది. తన సొంత కొనకనమిట్ల మండలం అన్‌రిజర్వ్‌డ్ కావడంతో జడ్పీటీసీ పదవికి బుధవారం ఆయన నామినేషన్ వేశారు. ఇప్పటికే గెలుపోటములకు అతీతంగా ఆ జిల్లాలోని పలువురు యువ నాయకులు జడ్పీ చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. కాగా అకస్మాత్తుగా ఉడుములను తెరపైకి తేవడం విశేషం. ప్రస్తుతం ఆయన అల్లుడు గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన వియ్యంకుడు, సీనియర్ నాయకులు కేపీ కొండారెడ్డి వచ్చే ఎన్నికల్లో మార్కాపురం తమ కుటుంబానికే కావాలని డిమాండ్ చేస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు చాకచక్యంగా పావులు కదిపి కొండారెడ్డి కుటుంబ సమీప బంధువైన ఉడుములను తెరపైకి తెచ్చినట్లు భావిస్తున్నారు. అదేసమయంలో గిద్దలూరు కూటమి పార్టీల మధ్య పొత్తులో భాగంగా బీజేపీకి లభించటంతో అక్కడ సఖ్యత లోపించింది. ఆ అవకాశాన్ని వినియోగించుకుని గిద్దలూరు మున్సిపాలిటీని కైవసం చేసుకోవచ్చన్న ఆలోచనతో వైసీపీ అధిష్ఠానం అనుక్షణం నాయకులతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇలా అంతోఇంతో మంచి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్న ఆశతో మార్కాపురం జిల్లాపై దృష్టిసారించిన వైసీపీ ప్రకాశం జిల్లా విషయంలో కనీస ఆసక్తి కూడా చూపిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రకాశం జడ్పీ చైర్మన్ విషయంపై ఆ పార్టీ నాయకులు కూర్చుని మాట్లాడుకున్నది కూడా లేదు. ఆ పార్టీ పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన కుమారుడి కోసం సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో మకాం వేశారు. స్థానికంగా నియోజకవర్గ ఇన్‌చార్జిల మధ్య కూడా సఖ్యత లేకపోవటంతోపాటు టీడీపీకి ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో బలమైన నాయకత్వం ఉండటంతో వైసీపీ తూతూమంత్రంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

పోటీదారుల వివరాల వెల్లడికి బ్రేక్

ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న అర్బన్ స్థానిక సంస్థల్లో పోటీ చేసిన అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణల గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. అనంతరం రంగంలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటించాల్సి ఉండగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వాటిని ప్రకటించకుండా జిల్లా అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ మేరకు కలెక్టర్ రాజాబాబు రాత్రి పొద్దుపోయాక అధికారికంగా ప్రకటన కూడా విడుదల చేశారు. జిల్లాలో ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు అద్దంకి, చీమకుర్తి, దర్శి మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్న విషయం విదితమే. ఈనెల 18తో నామినేషన్‌ల దాఖలు గడువు ముగియగా బుధవారం సాయంత్రం వరకు ఉపసంహరణలకు సమయం ఉంది. అయితే నామినేషన్ల సందర్భంగా జిల్లాలోని దర్శితోపాటు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో తమను నామినేషన్లను వేయకుండా కూటమి శ్రేణులు అడ్డుకున్నారని మరోసారి నామినేషన్ల దాఖలకు అవకాశం ఇవ్వాలంటూ వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు బుధవారం మధ్యాహ్నం ఇచ్చిన ఆదేశాలతో వైసీపీ ఆరోపణలు చేసిన చోట్ల పరిశీలన చేయాలని నిర్ణయించిన ఎస్ఈసీ తొలుత ఆ పట్టణాల్లో తుది జాబితాలను నిలిపివేయాలని అధికారులకు సూచించింది. దీంతో జిల్లాలోని దర్శిలో పోటీ ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించకుండా నిలిపివేసిన అధికారులు మిగతా మూడుచోట్ల సంబంధిత ప్రక్రియను చేపట్టారు. అయితే రాత్రికి ఇతర చోట్ల కూడా తాత్కాలికంగా నిలిపివేయాలని గురువారం స్పష్టత ఇచ్చాక పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించాలని ఎన్ఈసీ సూచించడంతో తదనుగుణంగా అధికారులు జాబితాలను ప్రకటించకుండా ఆపేశారు. అయితే బుధవారం సాయంత్రం వరకు దాఖలైన ఉపసంహరణల ప్రకారం అందిన సమాచారం మేరకు ఒంగోలులో మూడు డివిజన్ల కార్పొరేటర్లను అలాగే అద్దంకిలో మూడు కౌన్సిలర్ స్థానాలను టీడీపీ ఏకగ్రీవంగా గెలుచుకున్నట్లు తెలిసింది. అలాగే ఒంగోలు కార్పొరేషన్ మేయర్ స్థానానికి 15మంది అభ్యర్థులు రంగంలో ఉండగా అద్దంకిలో చైర్మన్ స్థానానికి ఆరుగురు, కౌన్సిలర్ స్థానాలకు 68. అలాగే చీమకుర్తిలో చైర్మన్ స్థానానికి ముగ్గురు, కౌన్సిలర్లకు 67మంది పోటీలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన అధికారికంగా గురువారం వెల్లడించే అవకాశం ఉంది

కనిగిరిలో భారీ అగ్నిప్రమాదం



కనిగిరి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): కనిగిరిలో ని సామిల్స్ వీధిలో మంగళవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మూడు ఉడ్ కటింగ్ షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. వాటిలోని విలు వైన యంత్రాలతోపాటు వినియోగదారులు కటింగ్ కోసం తీసుకొచ్చిన టేకు, వేప కలప అగ్నికి ఆహు తైంది. రూ.30లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రా?థమికంగా భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. సామిల్స్ వీధిలో ఒక వరుస అంతా సామిల్స్, ఉడ్ కటింగ్ షాపులు ఉన్నాయి. మంగళవారం రాత్రి 7.30 సమయంలో మూడు షాపుల నుంచి మంటలు చెలరేగాయి. స్థాని కులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈలోపు బకెట్లతో నీళ్లు తెచ్చి పోసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని దాదాపు రెండు గంటలు శ్రమించి ఎగసిపడుతున్న అగ్నికీలలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే షాపుల్లో ఉన్న నాలుగు చిత్రిక మిషన్లు, రెండు పాలిషింగ్ మిషన్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రజలు తమ అవసరాల కోసం తీసుకొచ్చిన టేకు, వేప కలప అగ్నికి ఆహుతయ్యాయి. కళ్లముందే షాపులు, యంత్రాలు, కలప కాలిపోవడంతో యజమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం రాత్రి ఘటనా స్థలా నికి చేరుకొని పరిశీలించారు. బాధిత షాపు యజమా నులు పెడమన కనకాచారి, ఎలివల శివప్రసాద్, బాలాల ఆచారి (మహేష్)లను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

బండరాళ్లపైనే భోజనాలు

కురిచేడు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): మండలంలోని పేరుంబొట్లపాలెంలో 200 ఏళ్ల నుంచి ఓ వింత ఆచారం కొనసాగుతోంది. ఆ గ్రామానికి చెందిన ఒక వర్గం వారు అమ్మవారిని ఏటా పూజించడం ఆనవాయితీగా వస్తోంది. కరువు వచ్చిన సందర్భంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించడం మరో ఆచారంగా పాటిస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడంతో బుధవారం ఆ వర్గం వారు కొండమీది దుగ్గిలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే వంట వండి కొండమీద బండరాళ్లపైనే వారందరూ భోజనాలు చేశారు. అనంతరం బండరాళ్లను శుభ్రం చేయకుండా వారు అలాగే వదిలి వెళ్లారు. అమ్మవారు కరుణించి వర్షం కురిపించి బండరాళ్లను శుభ్రం చేస్తుందని వారి విశ్వాసం. పూజతోపాటు వంటావార్పు కార్యక్రమాల లో పురుషులు మాత్రమే పాల్గొంటారు.

వరుడైన చిన తిరుమలేశుడు



ద్వారకాతిరుమల , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): చిన తిరుమలేశుడు బుధవారం ఉదయం పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయ దేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు తోడైన వేళ.. ఈ అద్భుత వేడుకను వీక్షించిన భక్తులు పరవశించారు. శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన ఈ వేదికపై ఏర్పా టుచేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మ వార్ల కల్యాణ మూర్తులను ఉంచి ఆలయ అర్చ కులు హారతులిచ్చి ఈ తంతును వేదవిద్యా ర్థుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాజాధి రాజ వాహనంపై ఉభయదేవేరులతో కొలువుదీరిన చినవెంకన్న విజయదశమి పర్వదినాన రాత్రివేళ శమీపూజ నిమిత్తం నృశింహ సాగరం వద్ద నున్న దసరా మండపం వద్దకు వెళ్లి పూజలందుకున్నారు. మేళతాళాల నడుమ క్షేత్రపురవీధుల గుండా నృశింహసాగరం వద్ద ఉన్న మండపం వద్దకు చేరుకోగా.. జమ్మిచెట్టు వద్ద అర్చకులు విశేషపూజలు చేసి హారతులి చ్చారు. విజయదశమి పర్వదినాలు పూర్తికావ స్తున్న నేపథ్యంలో భవానీ దీక్షాదారులు, భక్తు లతో చినవెంకన్న క్షేత్రం కిటకిటలాడింది. విజయవాడలో దుర్గమ్మను దర్శించిన భక్తులు మార్గమధ్యలోని శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. మహావిష్ణువుగా చినవెంకన్న భక్తులకు దర్శనమి చ్చారు. శ్రీవారి ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అలంకారోత్సవాల్లో శ్రీవారు ప్రతీ రోజూ ఓ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు, ఇందులో తొలిరోజైన బుధవారం శంఖు, చక్ర గదా ధారియై ఉభయదేవేరులతో విశేష పుష్ప అలంకారాల్లో మహావిష్ణువు అలంకారంలో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

అద్దంకిలో వైసీపీ నేతల హడావుడి

అద్దంకి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): అద్దంకి మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుండగా వైసీపీ నాయకులు ఏదో ఒక విధంగా రాద్ధాంతం చేసి అలజడి సృష్టించాలనే ధ్యేయంతో ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణల సమయంలో చోటుచేసుకున్న సంఘటనలు వైసీపీ నేతల తీరుకు అద్దం పడుతున్నాయి. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా 32వ వార్డు నుంచి వైసీపీ తరఫున పోటీచేసిన ఆలకుంట విజయరామరాజు, స్వతంత్ర అభ్యర్థి విజయరామరాజు భార్య ఆలకుంట హైమావ తిలు తమ అభ్యర్థిత్వాలను ప్రతిపాదించిన వ్యక్తుల ద్వారా నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో టీడీపీ తరఫున పోటీచేసిన బండారు వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లోపలకు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అలా వెళ్లటానికి వీల్లేదని సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వైసీపీ నేతలు నానా హడావుడి సృష్టించారు.

ప్రశాంతంగా పరిషత్ నామినేషన్లు

ఒంగోలు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): పరిషత్ ఎన్నికల్లో మొదటి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ బుధవారం జిల్లాలో ప్రారంభమైంది. ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యులకు నామినేషన్లను జడ్పీ సీఈవో, రిటర్నింగ్ అధికారైన బి.చిరంజీవి ఆధ్వర్యంలో స్వీకరించారు. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాల యాల్లో ఎంపీటీసీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు తీసుకున్నారు. జిల్లాలో 27 మండలాల పరిధిలో 27 జడ్పీటీసీ స్థానాలు, 373 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో 9 మండలాలకు చెందిన 13 మంది అభ్యర్థులు జడ్పీటీసీ స్థానాలకు నామినే షన్లు దాఖలు చేశారు. కురిచేడు, తాళ్లూరు, దొనకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, ఉలవపాడు, ముండ్లమూరు, లింగసముద్రం మండలాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. జిల్లాలో 373 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బుధవారం 140 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ల సందర్భంగా జిల్లాలో అక్కడక్కడా కొద్దిపాటి స్వల్ప వివాదాలు మినహా ప్రశాంతంగా ప్రక్రియ కొనసాగింది. కలెక్టర్ రాజాబాబు జిల్లాలోని పలు మండలాల్లో నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు. ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మద్దిపాడు, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల్లో ఎంపీటీసీ నామినేషన్లను పరిశీలించారు. అక్కడి రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా ఆయా కార్యాలయాల వద్ద భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే వాహనాలను నిలుపుదల చేశారు.

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, ఐపీఎస్



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ తో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఉదయం 7.30 గంటలకు పరేడ్ ప్రారంభమై, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎం. నరసింహమూర్తి పరేడ్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ రాక సందర్భంగా, అనంతరం ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాక సందర్భంగా స్మృతి పరేడ్ బృందం గౌరవ వందనం సమర్పించింది. అమరవీరుల స్మరణార్థం పరేడ్ కమాండర్ ఆదేశాల మేరకు "షహీద్ పుస్తక్ తోలి" నిర్వహించిననంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి త్యాగాలు పోలీసు సిబ్బందితో పాటు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసు వీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ అమరవీరుల పేర్లతో కూడిన రోల్ ఆఫ్ హానర్ ను చదివి వినిపించారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 154 మంది పోలీసులు వివిధ ఆపరేషన్స్ లో ప్రాణత్యాగం చేసి అమరులైనట్లు, వారిలో ఒకరు మన ఆంధ్రప్రదేశ్ నుండి ఉన్నారని పేర్కొన్నారు. అమరవీరులకు గౌరవ సూచకంగా అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తదుపరి అధికారులు, ఆహ్వానితులు, అమరవీరుల కుటుంబ సభ్యులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. పరేడ్ ముగిసిన అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి, వారితో ఆత్మీయంగా మాట్లాడి పండ్లు, నగదు సహాయం అందించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతిబింబించేలా దేవిన సిస్టర్స్ దేవిన సోహిత, దేవిన ధన్యత రూపొందించిన సైకత శిల్పం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం లో జేఎన్‌టీయూ కాకినాడ వైస్ ఛాన్సలర్ – ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమారి, ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ ఎ.బి.జి. తిలక్, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె వెంకటరావు, కాకినాడ పట్టణ సీఐలు, ట్రాఫిక్ సీఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, రిటైర్డ్ పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక పోరులో ఎన్డీఏ జెండా ఎగరాలి



నక్కపల్లి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వందకు వంద శాతం విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర హోం వివత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపు నిచ్చారు. నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆది వారం పాయకరావుపేట నియో జకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకుల తో మంత్రి అనిత ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. క్లస్టర్ల వారీగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిస్థితుల పై నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే ఏకైక లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య ఐక్యతను పెంపొందించాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఉన్న ప్రజాదరణను ఓట్ల రూపంలోకి మార్చుకోవాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, నక్కపల్లి పి ఎస్ సి ఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, మండల పార్టీ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబి, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, వెలగా శ్రీను, దేవర సత్యనారాయణ, ధార్ల కృష్ణ, కుర్ర బాబి, కోమర్తి బాబురావు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

శమీ పూజతో సకల శుభాలు : మద్వేష్



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : విజయదశమి సందర్భంగా ప్రతి ఒక్కరు నిర్వహించే పూజా కార్యక్రమాలలో శమి పూజకు అత్యంత ప్రాధాన్యత ఉందని పురోహితులు యాతగిరి మద్దిలేటి అన్నారు. స్థానిక గోడారి గుంట జర్నలిస్టు కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్లతో పాటు శ్రీ రమా సహిత సత్యదేవ, దాసాంజనేయ ఉమా సాంబశివులకు శమితో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శమీ పూజ ద్వారా మనం అష్టైశ్వర్యాలను పొందగలమని దానితో పాటు శని దోష నివారణ కూడా జరుగుతుందన్నారు. లక్ష్మీదేవి అనుగ్రహాన్ని తప్పక పొందగలమని అన్నారు. పండుగల పరమార్థం భక్తులను సంరక్షించడమేన కోసం మన పురాణా లలో అనేక వ్రతాలు పూజలు దీక్షలు మరియు యాత్రలు పొందుపరిచారని మద్వేష్ చెప్పారు నవరాత్రుల సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో తొలిరోజు నుండి భక్తులు అనేక విధాలుగా శక్తి స్వరూపిణి వివిధ రూపాలలో అర్చించడం జరుగుతోందని చివరి రోజు విజయదశమిగా ప్రత్యేక పూజలు మనం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ఈ తొమ్మిది రోజులు శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవాన్ని పండితులచే ప్రవచన రూపంలో శ్రవణం చేయడం మరియు నందా దీప పూజ పేరుతో తిలా మరియు నెయ్యి దీపాలను అఖండ దీపంగా వెలిగించడం వంటి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారని మద్వేష్ చెప్పారు. ప్రాంతాలు ఏదైనావ్పటికీ పూజా కార్యక్రమాలలో విభిన్న ఆచారాలతో పండుగలను వైభవంగా జరుపుకోవడం మన భారతీయ ఇతిహాస చరిత్రలో అంతర్భాగమని అన్నారు. శమీ పూజ అనంతరం భక్తులందరూ పరస్పరంగా శమీ దళాలను బ్రాహ్మణులకు దక్షిణ రూపంలో అందజేసి ఆశీర్వాదం పొందడం జరుగుతుందని చెప్పారు. ఈ శమీ పత్రాలను వారి వారి స్వగృహంలో లక్ష్మీదేవి నివాసముండే స్థానంలో పెట్టడం ఎంతో శ్రేయస్కరమని మద్వేష్ సవివరంగా వివరించారు. కార్యక్రమంలో బ్లూ రెయిన్ హాస్పిటల్ అధినేత శుభ శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఈ విశేష శమీ పూజా లో పాల్గొనగా కార్యక్రమంలో వేమగంటి శ్రీరామ నరసింహారావు (రాము),పన్యాల నరసింహారావు(బుజ్జి), పురోహితులు వరశురామాచా ర్ జయమ్మ దంపతులు, సంతోష్, రఘోత్తమాచార్, శ్రీమతి తుంగమణి, శివరావు దంపతులు, నందగిరి ప్రవీణ్ దంపతులు, లోక రాఘవేంద్రరావు సోదరీమణుల బృందం, రేగడిమిల్లి కృష్ణమూర్తి దంపతులు తో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతం అందరికీ ప్రసాద వితరణ జరిగింది.

బైబిల్ మత గ్రంధం కాదు మానవాళికి జీవ గ్రంధం



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : బైబిలు మత గ్రంథం కాదు మానవాళికి జీవ గ్రంథం అని అంతర్జాతీయ సువార్తికుడు అనిల్ కుమార్ అన్నారు.సివైఎఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డైరెక్టర్ మూర్తి రాజు అధ్యక్షతన కాకినాడ మెక్లారిన్ మైదానంలో నిర్వహించనున్న క్లిక్ అండ్ కమిట్ ఏకమ్ 5 మహాసభలో యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవాళిని సన్మార్గంలో నడిపించేదే బైబిలు అని అన్నారు.ముందుగా అనిల్ కుమార్ కుమార్తె శ్రద్ధ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని, యువతను ఉద్దేశించి చేసిన ప్రసంగం యువతీ యువకుల్లో చైతన్యం రేకెత్తించింది.సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ తనయి క్వినీ ఆలపించిన సుమధుర గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సివైఎఫ్ నేషనల్ కో-ఆర్డినేటర్ రెవ. కలవల జాన్ విక్లీఫ్, స్టేట్ కో-ఆర్డినేటర్ జోయల్, జిల్లా కో-ఆర్డినేటర్ మాసా సుధీర్ సన్నీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ కొత్తపల్లి సునీల్, మచ్చా బుజ్జి బాబు, పెయ్యల నాని బాబు, వారా వినోద్, చైతన్య, విజయ్ భాస్కర్, తెలుగు రవి, వల్లూరి నానాజీ, జిల్లా,మండల స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి : కలెక్టర్

విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు-2026లో పోలైన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సుల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, భద్రత, నిరంతర పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులతో పాటు ప్రిసైడింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌ను నిర్దేశించిన వాహనాలు, మార్గాల ద్వారా పోలీసు భద్రత నడుమ రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు ఈ వాహనాలను అనుసరించేందుకు అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని చెప్పారు. రెండు తాళాల విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండు అంచెల భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ లోపల, ప్రవేశ ద్వారం వద్ద, పరిసర ప్రాంతాల్లో 24 గంటల పాటు నిరంతర సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌కు 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సీసీటీవీ దృశ్యాలను వీక్షించేలా స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచే, మూసివేసే ప్రతి సందర్భంలో అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సమక్షం ఉండేలా చూడటంతో పాటు, ఈ ప్రక్రియను వీడియో చిత్రీకరించాలన్నారు. లెక్కింపు రోజున ప్రతినిధుల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌ను తెరవాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారి/ఎన్నికల అధికారి స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణాన్ని, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి లాగ్‌బుక్, వీడియో రికార్డులను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలైన బ్యాలెట్ బాక్సులకు పూర్తి భద్రత కల్పించాలని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా స్పష్టం

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై, కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మంగళవారం కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, ఏలేశ్వరం నగర పంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ బి-ఫారం లు పంపిణీ చేశారు. పిఠాపురం, సామర్లకోట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు దానం లాజర్ బాబు, పిట్టా జానకిరామ్‌లకు స్వయంగా బి-ఫారాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు, అలాగే కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

తీవ్ర మనస్తాపం తో భాజపా జిల్లా కార్యదర్శి కే.సునీత రాజీనామా



భీమునిపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి పదవికి భీమిలి ప్రాంతానికి చెందిన కంటుభుక్త సునీత రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి, ఎన్ మధుకర్ జీ కి, పివిఎన్ మాధవ్, రాష్ట్ర అధ్యక్షులు, మట్టా ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్, రెడ్డి పావని, విశాఖ జిల్లా ఇంచార్జ్, పరశురామరాజు, విశాఖ జిల్లా అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ లకు సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం లో సునీత మాట్లాడుతూ 2020లో భాజపా తరపున పోటీ చేయడం జరిగిందని, అలాగే ప్రస్తుతం స్థానిక ఎన్నికలకు 2, 3 వ వార్డుల నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసినా బిసి మహిళ అయిన తన అభ్యర్థిత్వం కోసం కూటమి తరపున పోటీ చేసే అవకాశం కోసం భాజపా పార్టీ ఎటువంటి ప్రయతం చేయని కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై విశాఖ జిల్లా కార్యదర్శిగా రాజీనామా చేస్తూ, ఇకనుంచి భారతీయ జనతా పార్టీ కార్యకర్తగా నాశక్తి మేరకు పార్టీకి నా సేవలు అందిస్తానని తెలియచేసారు. ఆమె భర్త నియోజకవర్గం మాజీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ 2020 నుండి నియోజకవర్గం కన్వీనర్ భాద్యతలు నిర్వహిస్తున్న తాను 2025 ఏప్రిల్ నెలలో కుటుంబ కారణాల దృష్ట్యా అమెరికాకు వెళ్లగా ఎటువంటి కారణం చూపించకుండా తనను కన్వీనర్ పదవీ నుండి తొలగించడం జరిగిందని, ఈ విషయాన్ని పలుసార్లు రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ దృష్టికి తీసుకువచ్చి నా ఇంతవరకు ఎలాంటి సందనా లేదన్నారు. ఇప్పుడు జరుగుతున్నస్థానిక సంస్థల ఎన్నికలలో 2వ వార్డు నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా.నామినేషన్ వేసినా నా అభ్యర్థితం కోసం కూటమి తరపున పోటీ చేసే అవకాశం కోసం పార్టీ ఎటువంటి ప్రయతం చేయని కారణంగా తీవ్ర అసంతృప్తి చెందుతు ఇకపై తాము కార్యకర్తగా పార్టీ కి సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

'దమ్ముంటే సీబీఐ దర్యాప్తు వేయించు

ఎమ్మెల్యే కొండబాబుకు ద్వారంపూడి ఓపెన్ ఛాలెంజ్!



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : కాకినాడ నిప్పుల కొలిమిగా మారింది. కొచ్చిన్ విమానాశ్రయం డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని తనపై విషం చిమ్ముతున్న కూటమి నేతలకు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. చేతగాని ఆరోపణలు మానుకుని ధైర్యముంటే సీబీఐ విచారణకు సిఫార్సు చేయాలని, లేదంటే తల ఎక్కడ పెట్టుకుంటారో చూసుకోవాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ద్వారంపూడి పదునైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. "కేంద్రంలో మీరే ఉన్నారు.. రాష్ట్రంలో మీ కూటమి ప్రభుత్వమే ఏలుతోంది. నాపై నిజంగా అనుమానం ఉంటే వెంటనే సీబీఐ ఎంక్వైరీ వేయించండి! ఆ విచారణలో నా ప్రమేయం ఇసుమంతైనా ఉన్నట్లు తేలితే శాశ్వతంగా రాజకీయాలకు గుడ్ బై చెబుతా.. మరి నిరూపించలేకపోతే నువ్వు రాజకీయ సన్యాసం తీసుకుంటావా కొండబాబూ?" అని తొడగొట్టి సవాల్ విసిరారు. అసలు నిజాలు తెలుసుకోకుండా మొరుగుతున్నారని మండిపడ్డారు. కొచ్చిన్ ఎయిర్‌పోర్టులో అరెస్టయిన అరుణ్‌కుమార్ అనే వ్యక్తినే అసలు సూత్రధారిగా, అతడే సత్యనారాయణ బ్యాగ్‌లో ఆ సరుకు పెట్టించినట్లు స్వయంగా డి ఆర్ ఐ రిమాండ్ రిపోర్టులోనే బట్టబయలు చేసిందని గుర్తుచేశారు. ఆరోపణలు రాగానే నిమిషం ఆలోచించకుండా పార్టీ నుంచి సత్యనారాయణను సస్పెండ్ చేశామని, తాము ఎవరినీ వెనకేసుకొచ్చే రకం కాదని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టు బియ్యం ఎగుమతులపై గిట్టనివాళ్లు చేసిన కుట్రల వల్ల కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వేసిన తప్పుడు అడుగులతో ఏకంగా రూపాయలు 1,000 కోట్ల విలువైన వ్యాపారం ఆగిపోయి, వేలాది మంది పోర్టు కార్మికులు, లారీ యజమానులు తిండిలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ నిధుల విడుదల పేరిట కాంట్రాక్టర్ల వద్ద 4 శాతం పర్సంటేజీలు గుంజుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. "మేము అధికారంలో ఉన్నప్పుడు పేదల కోసం 550 ఎకరాలు కొని, 36 వేల మందికి ఇళ్ల పట్టాలు పంచాం. ఈ రెండున్నరేళ్లలో మీరిచ్చిన ఒక్క సెంటు భూమైనా చూపించగలరా?" అని సూటిగా ప్రశ్నించారు. నగరంలో పగటిపూటే సింగిల్ నంబర్ లాటరీలు, క్లబ్బుల్లో పేకాట మాఫియా రాజ్యమేలుతోందని, మద్యం బాటిల్‌పై దర్జాగా రూపాయలు 10 అదనంగా దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారని ఫైర్ అయ్యారు. ఈ దోపిడీపై జిల్లా ఎస్పీ, ఎక్సైజ్ శాఖ తక్షణమే ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. చేతకాని అసత్య ప్రచారాలు, బురదజల్లే రాజకీయాలు కట్టిపెట్టి, చేతనైతే ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కొండబాబుకు ద్వారంపూడి గట్టిగా చురకలంటించారు. ఈ కార్యక్రమంలో సుంకర సాగర్ ,మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్ కుమార్, ఎంజి కిషోర్, సంఘాని నంద, జెడి పవన్ కుమార్, చక్రవర్తి, గద్దేపల్లి దాసు, తదితరులు పాల్గొన్నారు

మాతృ మరణాల పై డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలేన్స్ మరియు రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం



విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : ఈ రోజు అనగా తేది. 21.10.2026 ఎం.అభిషిక్త్ కిషోర్, జిల్లా కలెక్టర్, విశాఖపట్నం వారి అధ్యక్షతన డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి అధ్వర్యంలో కలెక్టర్ వారి సమావేశ మందిరంలో మాతృ మరణాల పై డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలేన్స్ మరియు రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వారు మాట్లాడుతూ జనవరి 2026 నుండి జూన్ 2026 వరకు జరిగిన 6 మాతృ మరణాలు, జనవరి లో న్యూ గాజువాక పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, భవాని గార్డెన్స్ పట్టణ ఆరోగ్యకేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, పి.ఎం.పాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, మార్చి నెలలో గాజువాక ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం, జూన్ నెలలో బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరియు సొంట్యాం ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 1 మాతృ మరణం పై సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ గర్భిణీల డేటా తీసుకుని వాట్సాప్ గ్రూప్ లోనే కాకుండా కేసు హిస్టరీ మొత్తం తీసుకుని ప్రైవేటు హాస్పిటల్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి తెలియచేయాలి. ఈ మాతృమరణాలు సంబవించిన ప్రాంతాలలో గల ఏ.ఎన్.ఎం లందరికి ఇది ప్రధమ తప్పుగా భావించి రెండోసారి మాతృ మరణం సంభవిస్తే ఉద్యోగం నుండి తొలగించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికీ ఆదేశించారు. అధిక రక్తపోటు గల కేసు లను గుర్తించి ముందుగా వారికీ డాక్టర్ యొక్క సేవలు అందించాలని వారికీ డయాగ్నోసిస్ అయ్యే ఖర్చులను రెడ్ క్రాస్ కేంద్రానికి గాని లేదా సి.ఎస్.ఆర్. నిధుల నుండి గాని అందించాలని మరియు గర్భిణీల విభాగంనకు టోల్ ఫ్రీ నెంబర్ ఒకటి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం లో ఏర్పాటు చేసి అది ప్రైవేటు హాస్పిటల్స్ వారికీ తెలియచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి ఆదేశించారు. కేసు లను ప్రైవేటు హాస్పిటల్స్ కన్నా కె.జి.హెచ్.కు రిఫర్ చేయాలని మెడికల్ అధికారులకు, ఏ.ఎన్.ఎం.లకు ఆదేశించారు. ఇది అంతయు ఏ గర్భిణీ మరణించకూడదని జిల్లా కలెక్టర్ వారు ప్రత్యేకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికీ, సిబ్బందికి ఆదేశించారు. డా.పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారు మాట్లాడుతూ మాతృమరణాలు ఇకముందు సంభవించకుండా చూసుకోవాల్సిన భాద్యత సంబందిత ఆరోగ్య కేంద్రం యొక్క మెడికల్ అధికారి పై ఆధారపడి ఉంటుందని మరియు సంబందిత ఆచీవీ సమయానికి గర్భిణీ స్త్రీ కి అవసరమైన సేవలను గుర్తించి అందజేయాలని తెలియచేశారు. ఇకముందు మాతృమరణాలు జరిగితే చర్యలు తీసుకోబడతాయని, హై రిస్క్ గర్భిణీ లు ప్రసవానికి వచ్చినప్పుడు కాలయాపన చేయకుండా KGH కు గాని VGH కు గాని రిఫర్ చేయాలని ఆ విధంగా సురక్షిత కాన్పు జరిగేలా చూడాలని సూచించారు. ఆచీవీ, ఆశా కార్యకర్తలు ఆడపిల్లలకు కౌమారదశ నుండి జరిగే మార్పులపై అవగాహన కల్పించాలని, గర్భిణీ స్త్రీలకు గర్భాధారణ నుండి అవగాహన కల్పించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి వారికి సమయానికి టీకాలు, పోషకాహారం మొ" ఆరోగ్య సేవలను అందేటట్లు చూడాలని తెలియచేశారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలకు బర్త్ ప్లానింగ్ సక్రమంగా చేయాలని మరియు ఆయా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య స్థితి పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశశీలో డా.నరేంద్ర సింగ్, DCHS, APVVP, డా.లూసి, డి.ఐ.ఓ., డా.ఉషాప్రసాద్, సూపరింటెండెంట్, VGH, డా.శైలజ, గైనకాలజిస్ట్, HOD, KGH, డా.ఆర్.జనార్ధన్, జనరల్ మెడిసిన్, KGH, డా.గణేష్, అనస్తీసియా, కె.జి.హెచ్. డా.బి.ఉ మావతి, డి.పి.ఎం.ఒ, బి.నాగేశ్వర రావు, డెమో, డా.ఎన్.వి.సమత, విమెన్ హెల్త్ ఆఫీసర్, డా.కె..అప్పారావు, ఎన్టీఆర్ వైద్య సేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, డా.వై.డి.కళ్యాణి, మెడికల్ ఆఫీసర్, మరియు ప్రాధమిక/పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ కోడ్ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలి : మండల ఎన్నికల అధికారి కే.శ్రీరాములు



పాయకరావుపేట , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అధికారి (ఆర్వో), ఎన్ఎన్ఎ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కే.శ్రీరాములు వర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా మండల ఎన్నికల అధికారి (ఆర్వో) కే.శ్రీరాములు స్థానిక ఇన్చార్జ్ ఎంపీడీవో, సహాయ ఎన్నికల అధికారి శరత్ బాబు, తహసీల్దార్, ద్వితీయ సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఎ.మహేశ్వరరావు, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు అతో కలిసి ఎంపీటీసీ జడ్పిటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వివరాలను పరిశీలించారు. ఈ నందర్భంగా పాల్గొన్న మండల ఎన్నికల సిబ్బంది కూడా నోటిఫికేషన్లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి (ఆర్వో) కే.శ్రీరాములు మాట్లాకమశు ఎన్నికల ప్రక్రియ ఆరంభమైన నేపత్రలలో ఎన్నికల ప్రవర్తన నియమావళీని (మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్) తూదచ తప్పకుండా పాటిస్తూ ఎంపీటీసీ జడ్పిటీసీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సర్వం సన్నద్ధం కావాలని మండల స్థాయి అధికారులు, సిబ్బందికి సూచనలు అందచేశారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని మండల ఎన్నికల అధికారి (ఆర్వో) కే.శ్రీరాములు అదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ పురుషోత్తం, ఇన్చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో వై. ఎస్. సత్యనారాయణ, మండల జీఎస్డబ్ల్యూఎస్ అధికారి జీవనలతతో పాటు మండల, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం వ్యాఖ్యలతో రాష్ట్ర ఎన్నికల కమీషన్, ప్రభుత్వం సిగ్గుపడాలి



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న అరాచకాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం స్పందించడం శుభ పరిణామం అన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయకుండా పచ్చ మూకలు చేసిన అరాచాకాన్ని సుప్రీం కోర్టు సైతం తప్పపట్టినా రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అదేశాలతో తమ పార్టీ నేతలు సుప్రీం కోర్ట్ ను ఆశ్రయించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికల ను కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని మండి పడ్డారు. కళ్ల ముందు ఇంతా ఘోరం జరుగుతున్నా ఎన్నికల సంఘం నోరు మెదపకపోవడం దారుణ మన్నారు. రాయలసీమలోని 19 మున్సిపాలిటీల్లో 63.5 మంది అభ్యర్థుల నామినేషన్లు లేకుండా చేశారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి జరిగిన అన్యాయంపై సుప్రీం కోర్టు స్పందించిన తీరుతో ప్రజాస్వామ్య వాదులు హర్ష వ్యక్తం చేస్తున్నారని నాగమణి పేర్కొన్నారు. హింస జరిగిన 19 మున్సిపాలిటీల్లో ఈ నెల 25 వరకు అభ్యర్థుల తుది జాబితా వెల్లడించకుండా సుప్రీం కోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిందని వెల్లడించారు. ఆ ప్రాంతాల్లో 48 గంటల పాట నామినేషన్లు దాఖలు చేసేందుకు అదనపు సమయం కేటాయించాలని ఈసీకి ఆదేశించడం శుభపరిణామం అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపి లు అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి ల పోరాటంతో ఈరోజు రాష్ట్రం లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహించేలా సుప్రీం కోర్ట్ ఆదేశించిందన్నారు..

రాష్ట్ర ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, అది కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పై కూటమి పార్టీల నేతలు అప్రజా స్వామికంగా దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. జరిగిన దాడులపై ఒక్క కేసును కూడా పోలీసులు నమోదు చేయలేదంటే రాష్ట్రంలో పరిస్థితి ఏ విధంగా ఉందో సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల సంఘంతో పాటు ప్రభుత్వం సిగ్గపడాలని ఎద్దేవా చేసారు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్న ప్రాంతాల్లో నేరుగా కలెక్టర్లకు అభ్యర్థులు అందించేలా వెసులుబాటు కల్పించడంతో పాటు, నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు పోలీసులు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించడం పట్ల నాగమణి హర్షం వ్యక్తం చేసారు.

బోట్‌క్లబ్‌లో పీపీపీ నిర్మాణాలు రద్దు చేయాలి



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఆదాయం, అభివృద్ధి లక్ష్యంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానాన్ని కాకినాడ నగరపాలక సంస్థ దుర్వినియోగం చేస్తోందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఆరోపించారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను అతి తక్కువ అద్దెలకు కేటాయిస్తూ ప్రజాధనానికి నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

రూ.8,100 అద్దెకు విలువైన స్థలం!

పిఠాపురం రోడ్డులోని బోట్‌క్లబ్ పార్కులో ప్లాట్‌ఫారం పక్కన, పార్కు అంతర్గత ప్రాంగణంలో సుమారు 600 నుంచి 800 గజాల స్థలాన్ని నెలకు రూ.8,100 అద్దెతో కేటాయించడం విచిత్రంగా ఉందని రమణరాజు పేర్కొన్నారు. ఏడాదికి రూ.97,200 అద్దెతోపాటు ప్రతి సంవత్సరం మూడు శాతం పెంపు నిబంధనతో టీ దుకాణ భవన నిర్మాణానికి పీపీపీ విధానంలో స్థలం కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికంగా చిన్న దుకాణాలకే నెలకు రూ.10 వేల వరకు అద్దె ఉంటుండగా, కోట్ల రూపాయల విలువైన ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలాన్ని ఇంత తక్కువ అద్దెకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో నగర ప్రజలకు తెలియాలని డిమాండ్ చేశారు. పీపీపీ ఒప్పందాల ఆధారంగా స్థలాల విలువను ఆసరాగా చేసుకుని వ్యాపార సంస్థలు బ్యాంకు రుణాలు పొందే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. గతంలో మున్సిపల్ స్థలాల్లో చిరు వ్యాపారులకు గుడ్‌విల్ వేలం విధానంలో జనతా దుకాణాలు ఏర్పాటు చేసే పద్ధతికి బదులుగా కార్పొరేట్ వ్యాపారాలకు ప్రాధాన్యమివ్వడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారా?

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పార్కులు, చెరువులు, పాఠశాలలకు కేటాయించిన స్థలాల్లో ఇతర నిర్మాణాలు చేపట్టడంపై ఉన్న పరిమితులను పట్టించుకోకుండా కార్పొరేషన్ వ్యవహరిస్తోందని విమర్శించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 72, తేదీ 20 ఫిబ్రవరి 2002 ప్రకారం పార్కులు, ఆటస్థలాల కోసం కేటాయించిన బహిరంగ స్థలాలను ఇతర అవసరాలకు మళ్లించరాదని పేర్కొన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే సహించరాదన్నారు. నగరంలో ప్రజలకు, మీడియాకు తెలియకుండా పీపీపీ విధానంలో కేటాయించిన ఇతర ప్రభుత్వ స్థలాల వివరాలు కూడా వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైతే సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి, ప్రభుత్వ ఆస్తులకు, అభివృద్ధికి, ఆదాయానికి నష్టం కలిగించే వ్యవహారాలను ప్రజల ముందుంచడంతోపాటు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

పార్కుగా మాత్రమే అభివృద్ధి చేయాలి

బోట్‌క్లబ్‌లో ఉద్యానవన అభివృద్ధి మినహా ఇతర నిర్మాణాలకు అనుమతించరాదని, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రమణరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ ఆస్తులను పీపీపీ విధానంలో కేటాయించేటప్పుడు మార్కెట్ ధరకు అనుగుణంగా, ప్రభుత్వానికి గరిష్ఠ ఆదాయం వచ్చేలా గుడ్‌విల్ వేలం నిర్వహించాలని సూచించారు. నగరంలో పీపీపీ విధానంలో కేటాయించిన అన్ని ఆస్తులు, ఒప్పందాలు, అద్దెలు, ఆదాయ వివరాలను పారదర్శకంగా మీడియా ముందు ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, నగర ప్రముఖులు ముందుకు రావాలని రమణ రాజు పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి



విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ భీమిలి నియోజకవర్గ పరిధిలోని 7 నుండి 11 వార్డుల జీవీఎంసీ కార్పొరేటర్ అభ్యర్థులతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ బుధవారం సాయంత్రం మధురవాడ కొమ్మాది జంక్షన్‌లోని శ్రీ సూర్య ఫంక్షన్ హాల్‌లో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలపై అభ్యర్థులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని కోరారు. అభ్యర్థులకు ఏవైనా అత్యవసర సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తితే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. దీనికోసం 7995095799అత్యవసర సమయాల్లో నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని భరోసా కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టవరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈసందర్భం గా సీపీ హెచ్చరించారు.డీసీపీ-1 మణికంఠ చందోలు,నార్త్ సబ్ డివిజన్ ఏసిపి ఎస్ అప్పలరాజు,సీఐ జి బాలకృష్ణ, ఎస్ ఐ లు డి రాము, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేట అసెంబ్లీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సీట్ల సర్దుబాటు విషయమై ఆందోళన వద్దు



నక్కపల్లి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటు విషయమై జనసైనికులు ఆందోళన చెందవద్దని, జిల్లా పార్టీ పెద్దలతో ఆలోచించి అడుగులు వేద్దామని రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ బోడపాటి శివదత్తు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భం గా శివదత్తు పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. శివదత్తు మాట్లాడుకూ, అసెంబ్లీ నియోజక వర్గ సమన్వయకర్తలు, సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేష్లతో కలిసి పేట అసెంబ్లీ నియోజకవర్గంలో 47 ఎంపీటీసీ, 2 జడ్పీటీసీ స్థానాలతో పాటు ఒక ఎంపీపీ స్థానం కోరుతూ జాబితా రూపొందించి పార్టీ అనకాపల్లి పార్లమెంట్ కమిటీకి సమర్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల సీట్ల సర్దుబాటుపై పార్టీ అధినాయకత్వం, జిల్లా పార్లమెంట్ కమిటీ నేతలు, టీడీపీ నేతలు సహా కూటమి నాయకులతో సంప్రదింపులు జరుగుతున్నందున జనసేన తరపున పోటీ చేయదలచిన అభ్యర్థులు కంగారు పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. శాసనసభ్యురాలు, హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో కూటమి నేతలతో ఇటీవల జరిగిన సమీక్ష సమాశేశంలో జనసేన పార్టీ నుంచి పోటీ చేయాలనుకుంటన్న సెగ్మెంట్ల గురించి మాత్రమే చర్చించారని, అభ్యర్థుల పేర్ల ప్రస్తావన ఎట్టి పరిస్థితుల్లోనూ రాలేదని శివదత్తు స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో జనసేనకు ఎన్ని స్థానాలు కేటాయించేది, పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచిస్తారని, కాబట్టి జనసైనికులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. అన్ని స్థానాలు ఖరారైన తర్వాత అభ్యర్థుల ఎంపికపై తనతోపాటు నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ పెద్దలు గెడ్డం బుజ్జి, తోట నగేష్, సమన్వయ కమిటీ సభ్యులు కలిసి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం



కాకినాడ , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : స్థానిక ఆడబాల ట్రస్ట్ వద్ద ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం సందర్భంగా డా అడ్డాల సత్యనారాయణ చే అయోడిన్ వలన ఉపయోగాలు పైన అవగాహన కల్పించారు. డా అడ్డాల మాట్లా డుతూ "ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న 'ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవాన్ని' జరుపుకుంటారని, అయోడిన్ అనేది మన శరీరానికి అత్యంత ముఖ్యమైన సూక్ష్మపోషకమని, ఇది మెదడు యొక్క సాధారణ అభివృద్ధికి, పెరుగుదలకు మరియు థైరాయిడ్ గ్రంథి సక్రమంగా పనిచేయడానికి అవసరమైన హార్మోన్లను (థైరాక్సిన్) ఉత్పత్తి చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. అయోడిన్ లోపం వల్ల మెద భాగంలో థైరాయిడ్ గ్రంథి వాపు రావడం,ముఖ్యంగా గర్భిణీ స్త్రీలలో అయోడిన్ లోపిస్తే పుట్టబోయే పిల్లలలో మేధస్సు మందగించడం మరియు శారీరక లోపాలు ఏర్పడటం,శక్తి స్థాయిలు తగ్గిపోయి ఎల్లప్పుడూ అలసటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, ప్రతిరోజూ వంటలలో అయోడిన్ కలిపిన ఉప్పును మాత్రమే ఉపయోగించడం అయోడిన్ లోపానికి సరైన పరిష్కారమని, ఆహారంలో సముద్రపు ఆహారాలు , పాల ఉత్పత్తులు, గుడ్లు మరియు అయోడిన్ సమృద్ధిగా లభించే కూరగాయలను చేర్చుకోవడం మంచిదని, దేశంలో అయోడిన్ లోపాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వాలు ఉప్పులో అయోడిన్ను తప్పనిసరి చేస్తూ అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, మహిళలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు పోలీసు అమరవీరులు స్మృతి స్థూపం వద్ద ఘన నివాళి

పోలీస్ కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్

విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): 21 అక్టోబరు 2026 పోలీసు అమర వీరుల స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు బీచ్ రోడ్ నందు గల అమర పోలీసు వీరుల స్మృతి స్థూపం వద్ద అమరులైన పోలీసులకు నివాళి అర్పించే కార్యక్రమంలో సీపీ గారు ముఖ్య అతిథి హాజరై , గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాల గురించి సీ.పీ మాట్లాడుతూ గౌరవనీయులైన వేదికను ఆలంకరించిన జిల్లా కలెక్టర్ కి, విశాఖపట్నం పోర్టు ఆధారిటీ చైర్మన్ గారికి , సీనియర్ అధికారులకు మరియు సీనియర్ పోలీస్ అధికారులకు , నేవి అధికారులకు, రిటైర్డ్ ఆఫీసర్స్, సివిలియన్స్, పాత్రికేయులు అందరికీ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం శుభాకాంక్షలు, మన దేశ భద్రత, ప్రజా శాంతి కోసం, ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు స్మరించుకునే రోజు ఇది. 1959 అక్టోబర్ 21 తేదీ లడాఖ్ హాట్ స్ప్రింగ్స్ లో భారత పోలీస్ బలగాలు 10 మంది జవ్రాఖీ సిబ్బంది ధైర్యవంతులు వీరమరణం పొందారు అని మనకు తెలుసు వారి త్యాగాన్ని స్మరించుకోవడానికి ప్రతి సంవత్సరం ఇదే రోజు పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని చేసుకుంటున్నాము. ఈ రోజు కేవలం అమరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారి కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యతను గుర్తుచేసే రోజు అని స్పష్టం చేశారు, తీవ్రవాదం, హింసాత్మక చర్యలు వంటి అనేక ప్రమాదకర సవాళ్లను ఎదుర్కొంటూ సమాజ రక్షణ కోసం పోలీసులు ప్రతిరోజు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. 1961వ సంవత్సరం నుండి ఇప్పటివరకు



దేశవ్యాప్తంగా 35,000 మందికి పైగా పోలీస్ సిబ్బంది దేశభద్రత కోసం ప్రాణాలర్పించారని వెల్లడించారు, గత సంవత్సరంలో (సెప్టెంబర్ 1 నుండి ఆగస్టు 31 వరకు) దేశవ్యాప్తంగా 154 మంది పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని, వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక పోలీస్ అధికారి/సిబ్బంది ఉన్నారని తెలియజేస్తూ వారి ఆత్మకు నివాళులు అర్పించారు, అమరుల కుటుంబాలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేమని, ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ వారి కుటుంబాలను ఆదుకుంటూ అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు, ప్రస్తుత కాలంలో నేరాల స్వభావం వేగంగా మారుతోందని, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల విక్రయాలు, ఆర్థిక మోసాలు వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు, విశాఖపట్నం నగరంలో అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్, సైబర్ నేరాల నివారణ చర్యలు, మహిళల భద్రత కోసం శక్తి అప్లికేషన్ (స్మ్ముగిఱ సూజూజూ), మరియు వయోవృద్ధుల రక్షణ కార్యక్రమాలు ప్రజల నమ్మకాన్ని పెంపొందిన్తున్నాయని తెలిపారు, విశాఖపట్నం నగరానికి సీనియర్ సిటిజన్ ఫ్రెండ్లీగా గుర్తింపు లభించిందని, పోలీసుల పట్ల ప్రజల ఆలోచనా విధానంలో సానుకూల మార్పు కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ముగింపుగా, సమాజంలో హింసకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజలకు మరింత చేరువై ఆదర్శంగా నిలవాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు, ప్రజా రక్షణలో ప్రాణాలను అర్పించిన మహనీయులందరికీ హృదయపూర్వక శ్రద్ధాంజలి అర్పిస్తూ, వారి త్యాగాల స్ఫూర్తితో దేశభద్రతకు, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని సీపీ తన సందేశాన్ని ముగించారు, జై హింద్. అనంతరం సాహిద్ పుస్తక్ టోలి బృందం వారు మార్చ్ ఫాస్ట్ లో వచ్చి గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రక్షక దళాలు మరియు పోలీస్ విభాగాలలో అమరులైన వీరుల వివరాలను కార్యక్రమ ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపికి అందించగా, తదుపరి సీ.పీ ADCP(అడ్మిన్) కి అందించారు. తదనంతరం ADCP(అడ్మిన్) పి.రామచంద్ర రావు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అమరవీరుల స్తూపం వద్ద వారి త్యాగాలను గుర్తిస్తూ అమరవీరులకు పుష్పగుచ్చాలతో ఘననివాళులు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , పోర్టు చైర్మన్ , నేవి అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, నగర సీనియర్ అధికారులకు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది, రిటైర్డ్ పోలీసు అధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు మరియు ఇతర ప్రముఖులు ఈ స్మృతి పరేడ్ లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.



విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులకు నివాళి

విజయనగరం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): తమ విధినిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన ప్రతిఒక పోలీస్ అమరవీరులకు ఎనలేని కృతజ్ఞతతో నివాళులు అర్పిస్తున్నామని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం 154 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ సంవత్సరం ఒక్కరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు, రాజ్యాంగ రక్షణ,శాంతి భద్రతల స్థాపన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిజాయితీ గల పోలీస్ అధికారులు నేటికీ రాష్ట్రంలో, దేశంలో తమ వంతు తీవ్ర కృషిచేస్తున్నారని వ్యవస్థ లో జరుగుతున్న ప్రతి చిన్న అంశాన్ని పోలీస్ శాఖ నిషితంగా పరిశీలించి ప్రజలకు మంచి మార్గం చూపించవలసిన బాధ్యతను చేపట్టిందని దానికి అనుగుణంగా ప్రజలు తమ బాధ్యతలు, హక్కులు తెలుసుకొని వ్యవహరించాలని భీశెట్టి అన్నారు,ప్రాణ త్యాగం చేసిన ప్రతి పోలీస్ అమరవీరుల కుటుంబానికి



దేశ పౌరులు రుణపడి ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

ఓటర్లందరికీ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు

జీవీఎంసీ కమిషనర్ , అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్



విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ పరిధిలోని ఓటర్లందరికి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు,జోనల్ అధికారులు ,ఇతర సంబంధిత అధికారులతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లందరూ తమ ఓటు హక్కు ఎక్కడుందో తెలుసుకుని వినియోగించుకునే విధంగా ఓటర్ స్లిప్పులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లో అవసరమైన చోట మరమ్మత్తులు, పోలింగ్ నిర్వహణ కు అనువుగా అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులతో బ్యాలెట్ పేపర్ , పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఎన్నికల విధులలో ఉన్నవారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి చర్యలు తీసు కోవాలన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



అనకాపల్లి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరుల స్మారక స్తూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి, పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. పోలీసులు అందించే భరోసాతోనే జిల్లా ప్రగతి -- జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ్ కృష్ణన్, ఐఏఎస్: కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ -- "సమాజంలో శాంతిభద్రతల రక్షణ కోసం ముఖపరిచయం లేని సాధారణ పౌరుల కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసే గొప్ప వృత్తి యూనిఫాం సర్వీస్. గడచిన రెండేళ్లలో అనకాపల్లి జిల్లా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లాకు రూ.4 లక... వీరమరణం పొందారు. నేడు లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం (నక్సలిజం), ఉగ్రవాదం వంటి సమస్యలు తగ్గుముఖం పట్టినప్పటికీ, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు వంటి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిని అణచివేసేందుకు పోలీసు సిబ్బంది మరింత ప్రొఫెషనలిజంతో పనిచేయాలి. చట్టపరిధిలో తమ విధులను నిర్భయంగా, నిస్పార్థంగా నిర్వహించినప్పుడే అమరుల త్యాగాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది. పోలీసు సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడంలో వారి కుటుంబ సభ్యుల పాత్ర, మద్దతు ఎంతో కీలకమైనవి. అమరుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది" అని తెలిపారు. ఈ సందర్భంగా 1983 నుంచి ఉమ్మడి విశాఖపట్నం రూరల్ పరిధిలో వీరమరణం పొందిన 27 మంది అమరవీరుల వివరాలను, దేశవ్యాప్తంగా అమరులైన పోలీసుల పేర్లను అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన రావు చదివి వినిపించారు. అనంతరం కలెక్టర్ మరియు ఎస్పీల చేతుల మీదుగా 14 మంది అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.10,000/- చొప్పున నగదు చెక్కులను, జ్ఞాపికలను అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన రావు, డీఎస్పీలు శ్రీ పి.శ్రీనివాస రావు, శ్రీ పి.వి.వి. నరసింహారావు, శ్రీ వి.బాబ్జీరావు, పరిపాలనాధికారి శ్రీ సిహెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, ప్రేమ కుమార్, అశోక్ కుమార్, నాగేశ్వరరావు, రమేష్, రామకృష్ణారావు, మన్మధరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరుల కుటుంబ సభ్యులు మరియు కృష్ణదేవిపేట జడ్పీ హైస్కూల్ ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

అనకాపల్లి జడ్పిటిసి రేసు లో పోల్నాటి



అనకాపల్లి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): అనకాపల్లి జడ్పిటిసి రేసులో సీనియర్ రాజకీయ వేత్త మార్టూరు కు చెందిన పోల్నాటి అప్పారావు ముందు వరుసలో ఉన్నారు. రాజకీయ చతురుడు వివాదాలకు దూరంగా ఉంటూ సేవ తత్పరత కలిగిన పోల్నాటి అప్పారావు మండలంలో గట్టు పట్టుంది. తెలుగుదేశం పార్టీ అవిర్భావం నుండి ఆయన పార్టీలో విశేష సేవలు అందించారు. గడచిన ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ (జనసేన అధినేత) పిలుపుమేరకు ఆ పార్టీలో చేరారు.. ఇప్పటికే తను సేవలను గుర్తించి సీటు కేటాయించాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ భీమరశెట్టి రామ్మీలకు తన దరఖాస్తులను పరిశీలించాలని కోరారు వారు సానుకూలంగా స్పందించారు.. మండల వ్యాప్తంగా బంధుత్వాలు సామాజిక వర్గం అంగ బలం ఆర్థిక బలం దండిగా ఉన్న పోల్నాటి అప్పారావు 1995లో ఒక్కసారి అనకాపల్లి జడ్పిటిసిగా తన భార్యను బరిలోకి దించి గెలిపించారు.. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలంగా ఉన్న అప్పారావు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదర్శాలకు ఆకర్షితుడై గడచిన ఎన్నికల ముందు పార్టీలో చేరి ఎమ్మెల్యే రామకృష్ణ ఎంపీ సీఎం రమేష్ గెలుపునకు విశ్వ ప్రయత్నం చేశారు.. క్రమశిక్షణ కలిగిననేతగా మండలంలో మంచి పట్టు ఉంది.కూటమి నాయకులతో కార్యకర్తలతో సత్సంబంధాలు ఉన్నాయి. పార్టీ అగ్రనేతులతో పరిచయాలు కలిగిన అప్పారావు బరిలో నిలిస్తే గెలుపు ఖాయం అనే భావన వ్యక్తం అవుతుంది.. గ్రామ రాజకీయాల్లో కూడా ఆయనది అందివేసిన చేయి.. సేవా కార్యక్రమాలు... దేవాలయాల నిర్వహణ.. వంటి కార్యక్రమాలను కూడా ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో జిల్లా స్థాయి పదవులను కూడా చేపట్టారు. ఏ పదవి చేపట్టిన ఆ పదవికి వన్నెతెచ్చిన వ్యక్తిగా గుర్తింపు ఉంది.

సంచలనం రేపుతున్న దివ్యాంగుడి ఆత్మస్థైర్యం

అంగవైకల్యాన్ని జయించి వైయస్సార్‌సీపీ అభ్యర్థి మద్ది శ్రీనివాస్ విజయం కోసం మాదివాణిపాలెం ధర్మరాజు సుడిగాలి ప్రచారం!



విశాఖపట్నం , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): జీవీఎంసి వరిధిలోని 104వ వార్డు వైయస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి మద్ది శ్రీను (శ్రీనివాస్) విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలు ఉధృతమైన, దూకుడుగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. వార్డువ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, గ్రామాల్లో ప్రతి గ్రామాన్ని, ప్రతి గడపను సందర్శిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. మద్ది శ్రీను ఇప్పటివరకు వార్డులో చేపట్టిన పలు ప్రజా సేవా కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఈ ఎన్నికల ప్రచారాన్ని మరింత హోరెత్తిస్తున్నారు. కార్యకర్తలు స్వయంగా బాధ్యత తీసుకుని ప్రతి గడపను తట్టి తమ నాయకుడికి మద్దతు ఇవ్వ వలసిందిగా కోరుతుండటంతో గ్రామాల్లో ప్రచారం ఎంతో జోరుగా సాగుతోంది. శరీరానికి వైకల్యం ఉండొచ్చు, సంకల్పానికి కాదు" – ధర్మరాజు స్ఫూర్తిదాయక ప్రచారం 'శరీరానికి వైకల్యం ఉండొచ్చు కానీ, సంకల్పానికి కాదు" అనే సత్యానికి అచ్చమైన నిదర్శనంగా నిలిచారు మాదివాణి పాలెం గ్రామానికి చెందిన వైయ స్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త ధర్మరాజు. ఈ ఎన్నికల ప్రచారం లో ఆయన చూపిన ఆత్మస్థైర్యం ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచల నంగా, చర్చనీయా ంశంగా మారింది. సొంతూరు దాటి మద్ది శ్రీను అన్న కోసం పర్యటన: పుట్టకతోనే రెండు కాళ్లు సరిగ్గా లేకపోయినప్పటికీ, వైయస్సార్‌సీపీ పార్టీపై మరియు 104వ వార్డు అభ్యర్థి మద్ది శ్రీనివాస్ పై ఉన్న అంతులేని అభిమానంతో ఆయన ప్రత్యేకంగా మహమ్మద్ సాయిపేట, చిన్నపాలెం గ్రామాలకు విచ్చేశారు. చురుగ్గా ఇంటింటి ప్రచారం: తన శారీరక అడ్డంకులను ఏమాత్రం లెక్కచేయకుండా ప్రత్యేక వాహనంపై ప్రచారం చేస్తూ, ప్రతి ఇంటి గడపకూ తిరిగి డోర్ టూ డోర్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ఓటర్లను కలుసుకున్నారు. సేవాభావం గుర్తింపు: మద్ది శ్రీనివాస్ గారు ప్రజాసేవలో చేసిన మంచి పనులను, ప్రజల కష్టాల్లో 'నేనున్నాను' అంటూ తోడుగా నిలిచిన తీరును ఊరందరికీ పూసగుచ్చినట్లు వివరించారు. అభివృద్ధికి శ్రీరామరక్ష: "వార్డు సమగ్ర అభివృద్ధి సాధించాలన్నా, భవిష్యత్తులో మన అందరికీ మేలు జరగాలన్నా మనమంతా ఏకతాటిపైకి రావాలి. మనందరం ఒకే మాటపై నిలబడి, అభ్యర్థి మద్ది శ్రీనివాస్ గారిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలి" అని ధర్మరాజు పిలుపునిచ్చారు. పోటెత్తిన మైనార్టీల బ్రహ్మరథం – ఫ్యాన్ గుర్తుకే మా మద్దతు ధర్మరాజు గారి ఈ అంకితభావానికి, కార్యకర్తల స్ఫూర్తిదాయక ప్రచారానికి స్థానిక ప్రజల నుండి, ముఖ్యంగా చిన్నపాలెం మైనార్టీ సోదరులు మరియు వైయస్సార్‌సీపీ అభిమానుల నుండి నీరాజనాలు లభిస్తున్నాయి. రానున్న జీవీఎంసి ఎన్నికలలో 104వ వార్డు వైయస్సార్‌సీపీ అభ్యర్థి మద్ది శ్రీనివాస్ గారికి తమ అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుపైనే గుద్ది, భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతి ముస్లిం మైనార్టీ సోదరుడు ఏకగ్రీవంగా స్పష్టం చేశారు. ఉత్సాహంగా సాగుతున్న ప్రచార దృశ్యాలు (ఫొటో ప్రత్యేకతలు) గడపగడపకూ సంక్షేమ సందేశం: వార్డులోని ప్రతీ ఇంటి వద్దకు అభ్యర్థి మద్దతుదారులు వెళ్లి, వృద్ధులు మరియు మహిళలకు పార్టీ కరపత్రాలు అందజేస్తూ వైయస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న ఆదరణ: ఇంటి ముందర కూర్చున్న పెద్దలు, మహిళలు పార్టీ కరపత్రాలను ఆప్యాయంగా స్వీకరిస్తూ తమ సంపూర్ణ మద్దతు ఫ్యాన్ గుర్తుకేనని తెలుపుతున్నారు. నాయకుల సుడిగాలి పర్యటనలు: యువజన నాయకులు, పార్టీ శ్రేణులు బృందంగా ఏర్పడి వీధుల్లో సమన్వయం చేసుకుంటూ జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రత్యర్థులకు దిమ్మతిరిగే జవాబు -- విజయం లాంఛనం! మాదివాణిపాలెం నుండి మహమ్మద్ సాయిపేట వచ్చి ఒక దివ్యాంగ కార్యకర్త చూపుతున్న ఈ కార్యదీక్ష స్థానిక ఓటర్ల హృదయాలను అమితంగా ఆకట్టుకుంటోంది. ధర్మరాజు చూపుతున్న ఈ ఆత్మీయాభిమానం, అంకితభావంతో పాటు కార్యకర్తల సమిష్టి కృషి, నాయకుడిపై ప్రజలు చూపుతున్న ఆదరణ చూస్తుంటే 104వ వార్డులో మద్ది శ్రీనివాస్ గారి అఖండ విజయం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పివి రమణ 107 వ జయంతి

అనకాపల్లి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): నీతి నిజాయితీలకు మారుపేరు, విలక్షణ రాజకీయవేత్త, మాజీ ఎమ్మెల్యే, ఆర్ ఇ సి ఎస్ వ్యవస్థాపకులు స్వర్గీయ పి.వి. రమణ (పెంటకోట వెంకట రమణ) 107 వ జయంతోత్సవాలు అనకాపల్లిలో ఘనంగా జరిగాయి. అనకాపల్లి ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ భవనంలో ఆర్ ఇ సి ఎస్ మాజీ ఎండి సంద్యాల నాగప్పారావు, సీనియర్ పాత్రికేయులు ఆడారి దేవకి ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులు గా ఆర్ ఈ సి ఎస్ మాజీ ఎండీలు దావూద్ ఆలీ, రాఘవరావు, విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి కేవీ గౌరీపతి, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, ఎన్టీఆర్ లిటరేట్స్ చైర్మన్ కర్రి దివాకర్ రావు, శ్రీ నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, విశ్రాంత తాసిల్దార్ పగడాల వీరభద్రరావు, సీనియర్ పత్రికేయులు పెంటకోట సీతారామ్, సీనియర్ న్యాయవాది బుద్ద సత్యనారాయణ, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఏఎన్ సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై సత్యం, ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్లు పెంటకోట శ్రీను కర్రి బంగారనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతాల నుంచి జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించి, నీతి, నిజాయితీలు, అంకితభావం, చిత్తశుద్ధి లతో ఈ ప్రాంతానికి పీవీ రమణ గుర్తింపును తీసుకువచ్చారన్నారు. మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్పాయ్ వంటి వారితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవన్నారు. అనకాపల్లి ప్రాంతంతో పాటు ఆర్ఈసిఎస్ ను ప్రారంభించి, వ్యవస్థను ఆయన ఎంతో అభివృద్ధి చేసి నేడు గ్రామాల్లో విద్యుత్ వెలుగులు ప్రసారం అయ్యేలా చేశారన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, అనకాపల్లి పొట్టి శ్రీరాములు భవనం నిర్మాణ నిర్వాహకులు, పొట్టి శ్రీరాములు చరిత్ర ప్రచారకులు పీఎంఎల్ నరసింహమూర్తి లను సత్కరించారు. ప్రతి ఏటా నిరాటంకంగా రమణ జయంతోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

రౌడీయిజం చేస్తే సహించం

ఒకటి తరువాయి

అని పునరుద్ఘాటించారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. “ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్” అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో ‘ఈగల్’ బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ‘షహీద్ పుస్తక్ టోలీ’, ‘అమరులు వారు’ పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్ : చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి ‘క్రిమినల్ లిటిగెంట్లు’ ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని ‘గొడ్డలి పార్టీ’గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని జగన్ విధ్వంస రచనలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి గుండాలను దించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారానికి వారం రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూనే, వైసీపీ అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వికృత మనస్తత్వం ఉన్నవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

‘చెప్పాం.. చేస్తున్నాం’.. స్థానిక ఎన్నికలకు చంద్రబాబు కొత్త నినాదం!

ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. నేడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సమన్వయంపై కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే రెబెల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని గుర్తుచేశారు. ‘చెప్పాం.. చేస్తున్నాం’ అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమగ్రంగా వివరించాలని ఆయన నేతలకు పిలుపునిచ్చారు. కూటమిలోని జనసేన, బీజేపీ పార్టీలతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియను సాఫీగా, సామరస్యపూర్వకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిత్రధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, జనసేన, బీజేపీలకు కేటాయించిన స్థానాల్లో కూడా రెబెల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కిచెప్పారు. టికెట్లు ఆశించి భంగపడిన నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబెల్స్‌గా నామినేషన్లు వేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు వెంటనే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులను ఎంపిక చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

ఎస్ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఒకటి తరువాయి

వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌనంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

ఆర్మీకి కొత్త రాడార్లు

ఒకటి తరువాయి

సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అవకాశాలు పెరిగే వీలుంది. గత దశాబ్దంలో భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీలో గణనీయమైన వృద్ధిని సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,746 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025-26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.38,424 కోట్లకు పెరిగాయి. భారత రక్షణ పరికరాలు ప్రస్తుతం 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2029 నాటికి ఏటా రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తుల తయారీ, రూ.50 వేల కోట్ల ఎగుమతులు సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధికి కేటాయింపులను కూడా పెంచింది. 2026-27లో ఈ కేటాయింపులు రూ.29,100.25 కోట్లకు చేరాయి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కొత్త రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన బడ్జెట్‌లో 25 శాతాన్ని అందుబాటులో ఉంచింది.

భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

ఒకటి తరువాయి

రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో సంబంధాలు అవసరమేనని రూబియో అన్నారు. ఆ దేశంతో తమకున్న సంబంధాలను సానుకూలంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. భారత్‌ను ఆందోళనకు గురిచేసే చర్యలను పాకిస్థాన్ నిరుత్సాహపరిచేలా తమ ప్రభావాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తకుండా చూడవచ్చని అభిప్రాయపడ్డారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను 1970ల నాటి అమెరికా విదేశాంగ విధానంతో పోల్చడం సరికాదని రూబియో అన్నారు. అప్పట్లో ప్రచ్ఛన్న యుద్ధం సహా అనేక పరిణామాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో పాకిస్థాన్ సైనిక పాలకులకు వాషింగ్టన్ మద్దతుగా నిలిచింది. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న రూబియో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా స్పందించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనడం అంత సులువు కాదని అన్నారు. సమస్యను పరిష్కరించడం తేలికై ఉంటే ఇప్పటికే యుద్ధం ముగిసిపోయేదని వ్యాఖ్యానించారు.

మార్కెట్లోకి జియో ఐపీఓ

ఒకటి తరువాయి

సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఐపీఓ తమ కంపెనీ ప్రస్థానంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ అభివర్ణించారు. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ప్రైస్ బ్యాండ్‌లో సుమారు 27 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఐపీఓ ప్రారంభమైన తొలి గంటల్లోనే రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి దీనికి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ.. “కంపెనీ లిస్టింగ్ అవ్వడంతో వాటాదారులు, కస్టమర్లు, ఉద్యోగులు, ఇతర భాగస్వాములపై మాకు బాధ్యత మరింత పెరిగింది. పారదర్శకత, బలమైన పాలన, స్థిరమైన వృద్ధికి కట్టుబడి ఉంటాం. మా సాంకేతిక సామర్థ్యాలను మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారిస్తాం” అని తెలిపారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను ప్రధానంగా తమ టెలికాం అనుబంధ సంస్థ రుణ భారాన్ని తగ్గించుకోవడానికి వినియోగించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. తద్వారా సంస్థను నికర రుణ రహిత స్థితికి తీసుకురావాలన్నది తమ ప్రణాళిక అని పేర్కొంది.

భవిష్యత్తులో చేపట్టే పెట్టుబడులకు, నిర్వహణ ద్వారా వచ్చే నగదు ప్రవాహాలను ఉపయోగించుకుంటామని వివరించింది. భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని, మొబైల్, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్, డిజిటల్ సేవలు తమ ఆదాయ వృద్ధికి కీలక చోదకాలుగా నిలుస్తాయని ఆకాశ్ అంబానీ విశ్వాసం వ్యక్తం చేశారు.

జగన్‌కు షాక్

ఒకటి తరువాయి

జమ్మలమడుగు, రాయచోటి, రాజంపేట, కమలాపురం మున్సిపల్ చైర్మన్ పీఠాలను టీడీపీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ముఖ్యంగా రాయచోటిలోని మొత్తం 44 వార్డులను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకోవడం విశేషం. మిత్రపక్షమైన బీజేపీకి ఎర్రగుంట్ల మున్సిపాలిటీని కేటాయించి కూటమి ఐక్యతను చాటుకుంది. అంతేకాకుండా, జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మున్సిపాలిటీపై కూడా టీడీపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే, ఈ ఏకగ్రీవాలపై వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అధికార కూటమి అక్రమాలు, దౌర్జన్యాలతో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుందని, కొన్నిచోట్ల నామినేషన్ పత్రాలను అక్రమంగా తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాడులు, బెదిరింపులతో తమను ఎన్నికల నుంచి తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ విజయాలపై కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్పందిస్తూ... ఉమ్మడి కడప జిల్లాలో ప్రజలు సరికొత్త రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని విస్మయకర పరిణామాలు చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు కడప జిల్లా రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి.

పట్టిసీమ పంపులు పీకేస్తానన్న జగన్..
ఇప్పుడు అవే నీళ్లు తాగుతున్నారు : దేవినేని ఉమా

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమనే భయంతోనే వైసీపీ అధినేత జగన్ సరికొత్త డ్రామాలకు తెరలేపారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 90 శాతానికి పైగా స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలే తమ నామినేషన్ పత్రాలను స్వయంగా చించుకుని, ఆ నెపాన్ని పోలీసులు, ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేవినేని ఉమా మండిపడ్డారు. “నామినేషన్లకు వెళ్తున్నారా? యుద్ధానికి వెళ్తున్నారా? పోలీసులపై దాడులు చేయడం ఏ సంస్కృతి?” అని ఆయన ప్రశ్నించారు. దర్శిలో మహిళా కానిస్టేబుల్, ఎస్సైల తలలు పగలగొట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో వైసీపీనే విధ్వంసం సృష్టించి, ఆ నెపాన్ని ప్రభుత్వంపై వేస్తోందని ఆరోపించారు. పులివెందులలో కిందిస్థాయి నేతలను నామినేషన్లు వేయమని జగన్ బతిమాలుకునే దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.



గతంలో పట్టిసీమ పంపులు పీకేస్తానని అన్న జగన్, ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో అవే నీళ్లు తాగుతున్నారని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టితో తెచ్చిన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులే రాయలసీమ, విశాఖ, కృష్ణా డెల్టాలను కాపాడుతున్నాయని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై కూడా వైసీపీ మీడియా వక్రభాష్యాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

ఒకటి తరువాయి

పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను కేసుల వారీగా పరిశీలించి అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్ఈసీ తన ప్రకటనలో తెలియజేసింది.

సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి : పెద్దిరెడ్డి

అమరావతి , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమ పార్టీకి ఎంతో బూస్ట్ ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు నేపథ్యంలో 19 మున్సిపాలిటీలలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ... నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తమ వారిని నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు



సులభంగా నామినేషన్లు వేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు.

కేంద్ర నిధులను అడ్డుకునేందుకే
వైసీపీ కుట్రలు : ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు , అక్టోబర్ 21 (గ్లోబల్ వార్త): కేంద్రం నుంచి వచ్చే నిధులు అడ్డుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా కుట్రలు చేస్తుందంటూ వైసీపీపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. వైసీపీ.. క్రిమినల్ లిటిగెంట్ పార్టీగా మారిపోయిందని విమర్శించారు. వైసీపీ వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పతనమైందని తెలిపారు. బుధవారం నెల్లూరులో ఆయన మాట్లాడుతూ.. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని అన్నారు. ఈ ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం అలవాటుగా పెట్టుకున్నారంటూ వైసీపీ చీఫ్ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారంటూ వైసీపీ సోషల్ మీడియాపై



ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కూటమి నేతలపై వైసీపీ దాడులు చేస్తూ వారే కోర్టును తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రిమినల్ లిటిగెంట్ పార్టీకి సరైన గుణపాఠం చెప్పాలని ప్రజలకు ఆయన సూచించారు. నెల్లూరు రూరల్‌లోని 36 స్థానాల్లో 8 ఏకగ్రీవమయ్యాయని తెలిపారు.

మరో 9 స్థానాల్లో వైసీపీ ప్రధాన అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారని చెప్పారు. డమ్మీ అభ్యర్థులు మాత్రమే బరిలో నిలిచారని పేర్కొన్నారు. 17 స్థానాల్లో వైసీపీ పోటీ లేనట్లే అయిందని అన్నారు. నెల్లూరు రూరల్‌లో జెన్‌జీలకు అవకాశం ఇస్తానని తాను ముందే చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భీమినేని వేదశ్రీ 44 డివిజన్ నుంచి అవకాశం ఇచ్చామని.. ఆమె ఎన్నిక ఏకగ్రీవమైందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA D.NO. 28-2-22, 11 FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA - 520002 . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902